శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, చైత్ర మాసం, బహుళపక్షం తదియ: ఉ. 10-24 తదుపరి చవితి అనూరాధ: తె. 3-06 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: ఉ. 6-57 వరకు అమృత ఘడియలు: మ. 3-42 నుంచి 5-27 వరకు దుర్ముహూర్తం: ఉ. 11-34 నుంచి 12-24 వరకు రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు సూర్యోదయం: ఉ.5.48; సూర్యాస్తమయం: సా.6.11 సంకటహరచతుర్థి

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

బుధవారం-16- ఏప్రిల్ 2025 | సంపుటి : 25 సంచిక : 290 | పేజీలు - 8 వెల : రూ 3 | www. citytimes news.com


## కోల్‌కతాకు షాక్

07



# ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు..

### ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్



**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం.. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది. మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు'' అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు.
సీఎల్పీ సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ జరిగింది. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేల డుమ్మా కొట్టారు. వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరయ్యారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'' అని పిలుపునిచ్చారు.
''ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది.
( మిగతా 2లో)



## నోవాటెల్ హోటల్‌లో సీఎంకు తప్పిన ప్రమాదం


నోవాటెల్ హోటల్ లో సీఎం రేవంత్ రెడ్డికి ప్రమాదం తప్పింది. ఆయన ఎక్కిన లిఫ్ట్ లో స్వల్ప అంతరాయం ఏర్పడి కాస్త కిందకు కుంగిపోయింది. ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్ట్ లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. లిఫ్ట్ మొరాయించడమే కాకుండా ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే కొంత లోపలికి దిగిపోయింది. దీంతో సీఎం రేవంత్ సహా అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. కాసేపు అంతా అయోమయానికి గురయ్యారు. ఈ క్రమంలోనే హోటల్ సిబ్బంది, సీఎం సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ లిఫ్ట్ ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్ లో సీఎం రేవంత్ ను పంపారు. (మంగళవారం) నోవాటెల్ హోటల్ లో జరిగిన సీఎల్పీ సమావేశంలో భాగంగా రేవంత్ అక్కడకు హాజరైన క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది.



## దుబాయ్‌లో దారుణం..

### –ఇద్దరు తెలంగాణ వాసుల హత్య..
### –మరో ఇద్దరికి గాయాలు..

దుబాయిలో ఒక విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. ఒక పాకిస్థానీ వ్యక్తి ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారిని దారుణంగా నరికి చంపగా.. మరో ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. శుక్రవారం జరిగిన ఈ దుర్ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతి చెందిన వారిలో ఒకరు నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్ (40) కాగా.. మరొకరు నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ అని వారి సహోద్యోగులు తెలిపారు. గాయపడిన ఇద్దరు వ్యక్తులు కూడా తెలుగువారేనని తెలుస్తోంది.
( మిగతా 2లో)


దుబాయ్ లో మృతి చెందిన తెలంగాణ కార్మికులు



## పింక్ బుక్‌లో రాసుకుంటాం..

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
కాంగ్రెస్ తాటాకుచప్పుళ్లకు భయపడేది లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బాన్సువాడలో రజతోత్సవ సన్నాహక సమావేశంలో పింక్ బుక్ పేరిట ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దంటూ కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్‌లో రాసుకుంటాం, బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదు. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు'' అంటూ కవిత వ్యాఖ్యానించారు. ''బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ. మాట తప్పడమే.. మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ..ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మ బలిదానాలకు కారణం కాంగ్రెస్. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలి. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి'' అంటూ కవిత పిలుపునిచ్చారు.

## ప్రభుత్వానికి ఐదేళ్ల సమయం ఉంది

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడితే బీజేపీకి వచ్చే లాభం ఏంటని ఆయన ప్రశ్నించారు. తొందరపడి తెలంగాణలో ప్రభుత్వాన్ని కూలగొట్టమని కిషన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రభుత్వానికి ఐదేళ్ల సమయం ఉంది. ప్రభుత్వాన్ని కూల గొట్టడానికి గుజరాత్ వ్యాపారులకు పని లేదా? వ్యాపారులు వాళ్ళ వ్యాపారాలు వాళ్ళు చేసుకుంటున్నారు అని వ్యాఖ్యానించారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టీ ఇలా చెట్లు నరికిన ఘటనలు దేశంలో తెలంగాణలో తప్ప ఎక్కడ జరగలేదు. హెచ్‌సీయూలో చెట్లు కొట్టిన AI వీడియో పోస్టుపై కేసు పెడితే పెట్టుకోండి. భావితరాలకు ల్యాండ్ కాపాడాల్సిన బాధ్యత మనపైన ఉంది.
( మిగతా 2లో)

## హైదరాబాద్‌లో కుమ్మేసిన వర్షం.. మరో మూడు రోజులు వానలే



**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కొన్ని గంటల పాటు మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇప్పటికే నగరంలోని పలు చోట్ల వర్షం పడుతోంది. ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, ఖైరతాబాద్, లక్డీకపూల్, సోమాజిగూడ, ఎర్రమంజిల్, తార్నాక, నల్లకుంట, విద్యానగర్, ఎల్‌బీ నగర్, దిల్ సుఖ్ నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతోంది.
( మిగతా 2లో)

## ఈడీ ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ .. అందులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై ఏప్రిల్ 25న ఢిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనుంది.
మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి.
( మిగతా 2లో)



## టోల్ కలెక్షన్ విధానంలో సంచలన మార్పు: 15 రోజుల్లో అమలు

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
టోల్ గేట్స్ వద్ద వాహనదారులు వేచి ఉండాల్సిన సమయాన్ని తగ్గించడానికి.. 2019లో ఫాస్ట్‌ట్యాగ్ అనే ఒక ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ సిస్టమ్ తీసుకొచ్చారు. ఇప్పుడు శాటిలైట్ బేస్డ్ టోల్ కలెక్షన్ సిస్టమ్ 'గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్' తీసుకురానున్నట్లు కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు.
జీఎన్ఎస్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి సన్నాహాలు జరుగుతున్నాయని.. ఇప్పటికే నితిన్ గడ్కరీ పలు సందర్భాల్లో పేర్కొన్నారు.
ఈ విధానాన్ని కర్ణాటకలోని బెంగళూరుమైసూర్ నేషనల్ హైవే275, హర్యానాలోని పానిపట్‌హిసార్ నేషనల్ హైవే709 మధ్యలో అమలు చేశారు. దీనికి సంబంధించిన ట్రైల్ కూడా విజయవంతంగా పూర్తయింది.
( మిగతా 2లో)




## అమెరికా విమానాల్ని కొనుగోలు చేయొద్దు

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
అమెరికాచైనాల మధ్య టారిఫ్ వార్ ( రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే చైనా పలు కీలక ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని నిలిపివేసింది. ఆ దేశ ఉత్పత్తుల్ని కొనుగోలు చేయడం మానేసింది. తాజాగా అమెరికాలోని విమానాల తయారీ సంస్థ బోయింగ్‌కు చెందిన విమానాల్ని కొనుగోలు చేయొద్దని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆ దేశ విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. బ్లూమ్‌బర్గ్ సైతం ఇదే విషయాన్ని ధృవీకరించింది.
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా మరియు చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమవుతోంది. ఇప్పటికే అమెరికా, చైనా నుంచి దిగుమతులపై 145 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. దీనికి ప్రతిగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం కస్టమ్స్ టారిఫ్‌లు విధించింది.
ఈ తరుణంలో చైనా, దేశీయ విమానయాన సంస్థలు బోయింగ్ విమానాలను కొనుగోలు చేయకుండా ఆదేశించినట్టు బ్లూమ్‌బర్గ్ నివేదించింది.
( మిగతా 2లో)



సిటీటైమ్స్ తెలుగు దినపత్రిక
city times



# ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు..

(మొదటి పేజీ తరువాయి)

సన్నబియ్యం పథకం ఒక అద్భుతం.. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకం. భూ భారతిని రైతులకు చేరవేయాలి. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచింది. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలి. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించాం. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనం. జఠిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తా. హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారు.



**మంత్రి పదవి కావాలంటే.. ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్**

బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది.

.కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోంది. దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయి. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలి. సన్న బియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## ప్రభుత్వానికి ఐదేళ్ల సమయం ఉంది

(మొదటి పేజీ తరువాయి)

భూములు అమ్మకం ద్వారానే ప్రభుత్వం నడపాలని అనుకోవద్దు. రేవంత్ ఏ బ్రాండ్ అనేది వచ్చే ఎన్నికల్లో తేలుతుంది. నేషనలిజమే నా బ్రాండ్. ప్రాజెక్ట్ పూర్తి కాకుండా ఎస్ఎల్‌బీసీపై నేషనల్ డ్యాం సెక్యూరిటీ అథారిటీకి ఎలా ఫిర్యాదు చేస్తాం?. సింగరేణి కార్మికులకు ఐటీ పన్నులు మేం అధికారంలోకి వస్తే రియింబర్స్ చేస్తాం. సింగరేణి కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేస్తారు. వాళ్లది వైట్ కాలర్ జాబ్ కాదు.



**సన్నబియ్యంపై..**

ఏ రాష్ట్రంలోనైనా ఆ రాష్ట్ర ప్రజల అవసరానికి అనుగుణంగా ఇస్తాం. కొన్ని రాష్ట్రాల్లో గోధుమలు కూడా సరఫరా చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కోటా కాకుండా ప్రతీ లబ్దిదారుడికి అదనంగా ఐదు కేజీల సన్న బియ్యం ఇచ్చి చూపించాలి. దొడ్డు బియ్యం పైసలతోనే సన్న బియ్యం ఇస్తున్నారు. దీంట్లో కొత్తగా ఏముంది? అని ప్రశ్నించారు.

పార్లమెంట్ ఎన్నికలలో తమిళనాడులో నష్టపోయామని.. అక్కడ పొత్తుకు వెళ్లాం. యధ్యక్షుడిగా నా పేరు ప్రచారంపై అటువంటి ప్రస్తావనే లేదు. దక్షిణాదికి లోక్ సభ సీట్లు తగ్గుతాయనేది గాలి ప్రచారం మాత్రమే. అన్యాయంగా వక్ఫ్ పేరుతో ఆక్రమించిన భూముల కోసమే కొంతమంది ఆందోళనలు చేస్తున్నారు. ఎంఐఎం నేతలు, అక్రమంగా లబ్ది పొందిన వారే ఆందోళనల్లో ఉన్నారు. ఏ ఒక్క సామాన్య, పేద ముస్లిం కూడా ఆందోళన చేయడం లేదు. వక్ఫ్ సవరణ చట్టం మీద భూబకాసురులు ఉద్యమం చేస్తున్నారు. ముస్లిం ప్రార్థన మందిరాలను, వక్ఫ్‌కు సంబంధం లేదు' అని అన్నారు.

## టోల్ కలెక్షన్ విధానంలో సంచలన మార్పు: 15 రోజుల్లో అమలు

(మొదటి పేజీ తరువాయి)

కాగా రాబోయే 15 రోజుల్లో దేశవ్యాప్తంగా కొత్త శాటిలైట్ బేస్డ్ టోల్ కలెక్షన్ విధానాన్ని ప్రవేశపెడతామని గడ్కరీ ప్రకటించారు.

గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ అమలులోకి వచ్చిన తరువాత.. వాహనాలు టోల్ ప్లాజాల దగ్గర ఆగాల్సిన అవసరం లేదు. ఈ విధానం టోల్ వసూళ్ల ప్రక్రియలలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ద్వారా.. రియల్‌టైమ్ లొకేషన్ ట్రాకింగ్ జరుగుతుంది. అంతే కాకుండా వాహనదారుడు ప్రతిరోజూ హైవే మీద 20 కిమీ వరకు టోల్‌ఫ్రీ ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు. అంటే 20 కిమీ ప్రయాణానికి టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నమాట.




**శాటిలైట్ విధానం ద్వారా టోల్ కలెక్షన్**

గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ అమలులోకి వచ్చిన తరువాత టోల్ ఫీజు చెల్లించడానికి ప్రత్యేకంగా.. వాహనాలను ఆపాల్సిన అవసరం లేదు. వాహనం ప్రయాణించిన దూరాన్ని శాటిలైట్ లెక్కగట్టి వ్యాలెట్ నుంచి అమౌంట్ కట్ చేసుకుంటుంది. అయితే దీనికోసం వాహనదారులు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ చిప్ కలిగిన ఫాస్‌ట్యాగ్‌ను వాహనానికి అతికించాల్సి ఉంటుంది. లేదా ఇతర ఆన్ బోర్డ్ యూనిట్ లేదా ట్రాకింగ్ పరికరాలను అమర్చి.. టోల్ ఫీజు వసూలు చేసే అవకాశం ఉంది.

## దుబాయ్‌లో దారుణం..

(మొదటి పేజీ తరువాయి)

మృతులు , గాయపడిన వారితో పాటు ఈ ఘాతుకానికి పాల్పడిన పాకిస్థానీ వ్యక్తి కూడా దుబాయిలోని ఒక ప్రఖ్యాత బేకరీలో పనిచేస్తున్నారు.

పని ఒత్తిడి, ఇతర వ్యక్తిగత కారణాలతో పాటు మత విద్వేషం కూడా ఈ దారుణానికి దారితీసిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. నిందితుడు వారిని చంపిన తర్వాత మతపరమైన నినాదాలు చేశాడని కొన్ని కథనాలు సూచిస్తున్నాయి. అయితే.. బేకరీ యాజమాన్యం ఈ ఘటనకు సంబంధించిన సమాచారం బయటకు రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. విషయం బయటకు తెలిస్తే ఉద్యోగాల నుండి తొలగిస్తామని యాజమాన్యం హెచ్చరించడంతో అక్కడి ఉద్యోగులు భయాందోళనలకు గురవుతున్నారని సమాచారం. దుబాయిలోని ఈ బేకరీలో పనిచేస్తున్న వారిలో ఎక్కువ మంది తెలంగాణ రాష్ట్రానికి చెందినవారేనని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దుబాయి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఘటన తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మృతి చెందిన వారి కుటుంబాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. హత్యకు గురైన ప్రేమ్ సాగర్ కు భార్య, ప్రమీల ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అయితే గత వారం క్రితం ఇంట్లో నానమ్మ మృతి చెందగా పెద్దకర్మ జరిగిన రోజు శుక్రవారం అతని బావ ప్రమాదానికి గురై నిజామాబాద్ లో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఒకే కుటుంబంలో వరస సంఘటనలు జరగడం తీవ్ర విషాదాన్ని నింపింది. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన నెలకొంది. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల భద్రతపై ఈ ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించి.. దుబాయిలోని భారతీయ రాయబార కార్యాలయం ద్వారా పూర్తి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. మృతుల కుటుంబాలకు సహాయం అందించడానికి.. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇటువంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా చూడటానికి గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న భారతీయ కార్మికుల భద్రత కోసం మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించడానికి.. వారికి సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పిం





దుబాయ్ లో మృతి చెందిన తెలంగాణ కార్మికులు

## ఈడీ ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు

(మొదటి పేజీ తరువాయి)

హరియాణాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.



**'బెంగాల్ మండిపోతుంటే..మౌనమా!'.. దీదీపై యోగి ధ్వజం**

నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్న వారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్న వారు ఇక నుంచి తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియను చేస్తున్నామని తెలిపింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. తాజాగా దిల్లీ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. తదుపరి విచారణను కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

**కాంగ్రెస్ మౌనంగా ఉండదు.. సత్యమేవ జయతే: జైరాం రమేశ్**

నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడమనేది చట్టబద్ధమైన పాలన ముసుగులో ప్రభుత్వ ప్రాయోజిత నేరంగా కాంగ్రెస్ పేర్కొంది. తమ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర నేతలపై ఛార్జిషీట్ దాఖలు చేయడం.. ప్రధాని, హోంమంత్రి ప్రతీకార రాజకీయాలు, బెదిరింపులకు పాల్పడటం తప్ప మరొకటి కాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ, నాయకత్వం మౌనంగా ఉండబోవన్న ఆయన.. 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

**ఇలాంటి వాటికి కాంగ్రెస్ భయపడదు.. ఎంపీ అఖిలేశ్ ప్రసాద్‌సింగ్**

కాంగ్రెస్ అగ్రనేతల పేర్లతో ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడంపై ఆ పార్టీ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ సింగ్ స్పందించారు. ప్రతీకారంతో, విపక్ష నేతలను ఉచ్చులో పడేసేందుకు భాజపా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కానీ, ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ భయపడదన్నారు.



## హైదరాబాద్‌లో కుమ్మేసిన వర్షం.. మరో మూడు రోజులు వానలే

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారిగా వాతావరణం మారి.. వర్షం కురుస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్ల మీదకు రావడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. భారీ వర్షం కురుస్తోన్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ యంత్రాగం అప్రమత్తమైంది. తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ని జారీ చేసింది. దక్షిణ మధ్యప్రదేశ్ మధ్య నుంచి ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాల మీదుగా దక్షిణ గ్యాంజెటెక్ పశ్చిమ బెంగాల్ వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని.. సగటున సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది.

## అమెరికా విమానాల్ని కొనుగోలు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాకుండా, అమెరికా నుండి విమాన భాగాలు ,ఉపకరణాల కొనుగోళ్లను కూడా నిలిపివేయాలని పేర్కొంది. అదే సమయంలో విమానాల లీజు తీసుకునే సంస్థలకు చైనా ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.



ఇక ట్రంప్ విధించిన టారిఫ్‌లు ప్రపంచ మార్కెట్లను గందరగోళంలోకి నెట్టేశాయి. మిత్రదేశాలు, ప్రత్యర్థులతో కూడిన సంబంధాలపై ప్రభావం చూపించాయి. గత వారం ట్రంప్, కొత్త టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేశానని ప్రకటించినా, చైనాకు ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. అమెరికా అధికారులు ఇటీవల స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు,సెమీకండక్టర్లు వంటి హైటెక్ ఉత్పత్తులపై టారిఫ్ మినహాయింపులు ప్రకటించారు.

## మాటలతో ఆటలాడవద్దు..

హైదరాబాద్, (సిటీ టైమ్స్):

కాంగ్రెస్ ప్రభుత్వాన్నికూల్చేయబోతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మాటలతో ఆటగాడవద్దు. మీ గేమ్స్ చెల్లవు' అంటూ అని తీవ్రంగా స్పందించారు. ఈ అంశంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందని, బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకించే వారే ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తారని మండిపడ్డారు.

(ఇదీ చదవండి: 'ఆ టెస్టులు మీరే చేయించుకుంటే మీ అసలు రంగు బయటకొస్తది')

ఇదిలా ఉంచితే,. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ నగరంలో నోవాటెల్ హెటల్ లో జరిగిన సీఎల్పీ సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో సంక్షేమం ఒక ఎత్తు అయితే.. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన పకడ్బందీగా పూర్తి చేశాం. ఈ రెండు అంశాలు గత కొన్ని దశాబ్దాలుగా గొప్ప గొప్ప నాయకులే చేయలేకపోయారు మన ప్రభుత్వం అందరికీ చెప్పి చేసింది.

ఈ రెండు అంశాలు చేయాలని ఇప్పుడు దేశవ్యాప్తంగా డిమాండ్ మొదలవుతుంది. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ఆమోదించాము. ఎస్సీ కుల వర్గీకరణ జరిగింది. దేశంలో కొద్దిమందికి ఇష్టం లేకపోయినా భూసంస్కరణలు వంటి గొప్ప నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ గతంలో చేపట్టింది. అందుకే ఈ దేశంలో సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ అధికారంలో కొనసాగింది.

బీసీ కుల గణన, sc వర్గీకరణ పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బి ఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీలను మూట కట్టి మూలన పడేసే విషయాలు.. ఇవి వారి అస్తిత్వానికే ప్రమాదం కాబట్టి బీఆర్ఎస్, బిజెపి చేతులు కలిపి ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు చిత్రీకరిస్తున్నారు.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని భావించి కంచ గచ్చిబౌలిలో ఏనుగులు, పులులు తిరుగుతున్నట్టు బిజెపి, బీఆర్ఎస్ కలిసి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ని ఉపయోగించి కుట్రలు చేస్తున్నాయి. బీసీ కుల సర్వే మీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. ఏకంకండి, మాతో కలిసి రండి అని చెప్పి బహుజన వర్గాలను చైతన్యం చేయాలి. కులగణన ద్వారా పొందాల్సిన ఫలితాలను అందుకున్నాము. సంక్షేమ పథకాలు, బీసీ కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ నిశ్శబ్ద విప్లవాలు' అంటూ ఆయన స్పష్టం చేశారు.



# సన్నబియ్యంతో పేదల కడుపు తీపిని తీర్చిన

**-కారణజన్ముడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**-మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:**
సన్నబియ్యంతో పేదల కడుపు తీపిని తీర్చిన కారణ జన్ముడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని లెనిన్ నగర్ లో సన్నబియ్యం లబ్దిదారులు లక్ష్మమ్మ భాస్కర్ దళిత కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం లబ్ధిదారుని ఇంట్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలు వేసి లక్ష్మమ్మ కుటుంబానికి ప్రభుత్వం నుండి ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం లబ్దిదారుని ఇంట్లో మధ్యాహన భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం ద్వారా నిరుపేదల ప్రజలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా ద్వారా రైతులకు 12వేల పెట్టుబడి సహాయం, రైతులకు 2లక్షల రుణమాఫీ, ప్రజా ప్రభుత్వ తొలి ఏడాదిలోనే 50వేలకు పైన ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా పేదల ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం, తెలంగాణ రైతాంగానికి రక్షణ కవచంగా భూభారతి పథకం, పేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా 10 లక్షల ఆరోగ్యశ్రీ పథకం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎస్సి వర్గీకరణకు, బడుగు బలహీన వర్గాల భావితరాల భవిష్యత్తు కోసం బిసిలకు 42శాతం రిజర్వేషన్, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకోసం రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా 5 లక్షల వరకు ఆర్థిక సహాయం, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక, జీర్ణించుకోలేక ప్రజను ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో మన రాష్ట్రం సాంకేతిక, పారిశ్రామిక రంగాలలో గణనీయంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, బుచ్చిరెడ్డి, రషీద్ బేగ్, రాజిరెడ్డి, రామ్ నర్సయ్య, రామిరెడ్డి,శ్రీనివాస్, నాగరాజు, శ్రీదేవి, చంద్రవతి, లత, రవి, మధు, సంతోష్,సతీష్,లాల్ మహమ్మద్, రవీందర్ రెడ్డి, వెంకట్ రాజు, రవి చారిలతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**కొలన్ శ్రీనివాస్ రెడ్డి**

**నిజాంపేట్, సిటీటైమ్స్:**
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతి నగర్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గత రెండు సంవత్సరాలుగా డ్రైనేజీతో పాటు పలు సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు కాలనీ వాసులు. కాలనీని సందర్శించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణ , బాలకృష్ణ , అల్లాడి మహేష్, మేకల బాలకృష్ణ మరియు కాలనీవాసులు ఎన్ఎంసి సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.



# యువతిని గర్భవతిని చేసిన వ్యక్తి అరెస్ట్

**బాచుపల్లి, సిటీటైమ్స్:**



బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. బాచుపల్లి సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన బొల్లం యేసుదాస్ డేవిడ్(45) అనే వ్యక్తి మల్లంపేటలో నివాసం ఉంటూ ఫోటో గ్రాఫర్ గా పనిచేస్తున్నాడు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సోషల్ మీడియా క్యాంపెనర్ గా ఉద్యోగంలో చేరిన యువతితో కలిసి పనిచేసిన సమయంలో ఆమెను వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెతో శారీరక సంబంధం కొనసాగించగా ఆమె గర్భం దాల్చింది. పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన డేవిడ్ పై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి బాచుపల్లికి ఫార్వర్డ్ చేయడంతో సోమవారం నిందితుడు డేవిడ్ ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించడమైనదని సిఐ పేర్కొన్నారు.

# గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సమ్మెను విజయవంతం చేయాలి

**-ఎంపీడీవో రాములు వినతి పత్రం సమర్పణ.**

**పాలకుర్తి, ఏప్రిల్ 15,( సిటీ టైమ్స్).**



పాలకుర్తి మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీసు నందు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్ యూనియన్ ఈనెల 19 తర్వాత సమస్యల పరిష్కారానికి ఏ రోజు నుండైనా రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను వెళ్తామని ఎంపీడీవో రాములు వినతిపత్రం సమర్పించడం అయినది. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి వేతనాలు చెల్లింపులు జరుగుతున్న ఇబ్బందులు శాశ్వతమైన పరిష్కారం చేపడతామని పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వల్లే గ్రీన్ చావాల్ ద్వారా 2025 జనవరి నుండి ప్రభుత్వమే కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని ప్రకటించడం జరిగింది .అదేవిధంగా ఆరు నెలల బకాయి వేతనాలు అందక ప్రభుత్వమే చెల్లిస్తుందన్న వేతనాల చెల్లింపులు స్పష్టత లేక తీవ్ర గందరగోళానికి మనస్థాపాలకు గురైన కార్మికులు ఆత్మహత్యకు చేసుకొని మరణిస్తున్నారు .ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ట్రెజరీలో నిలిచిపోయిన కార్మికుల బాకాయి వేతనాలు నిధులు తక్షణమే విడుదల చేయాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలి .వేతనాలకు బడ్జెట్ కేటాయించాలని .గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని మరియు పంచాయతీ సిబ్బంది కూడా రెండవ పిఆర్సి పరిధిలోకి తీసుకురావాలని .జీవో నెంబర్ 51 సవరించాలని. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి .పాత కేటగిరీలు అన్నింటిని కొనసాగించాలి .కారోబార్ ,బిల్ కలెక్టర్ ,సహాయక కార్యదర్శిగా నియమించాలి, అర్హులైన సిబ్బందికి ప్రమోషన్ కల్పించాలి , పంచాయితీ సిబ్బందికి ఉద్యోగ భద్రత ,రిటైర్మెంట్ బెన్ ఫీట్ 5 లక్షలు ఇన్సూరెన్స్, ఈ ఎస్ఐ ,పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ధరావత్ శ్రీను, రమేష్, సుందర్ ,మాన్య, కుమార్ ,మైసయ్య ,సోమన్న ,వెంకటయ్య, అనిల్, ఐలేష్ ,సిహెచ్ సోమయ్య, బి వెంకన్న, జి మైసయ్య, భద్రయ్య ,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# ఎసిబికి చిక్కిన అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్

**-రూ.70వేలు తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన శ్రీనివాస్**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**



శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో ఎసిబి గాలానికి ఓ అవినీతి అధికారి చిక్కాడు. మంగళవారం జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఎసిబి అధికారులు సోదాలు చేశారు. జోనల్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ గదిలో రంగారెడ్డి జిల్లా ఎసిబి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. గత కొంతకాలంగా చాంద్రాయణ గుట్ట సర్కిల్ లో అర్బన్ బయోడైవర్సిటి విభాగం ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ చాంద్రాయణ గుట్ట సర్కిల్ పనికి సంబంధించిన ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.2. 20లక్షలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు నుంచి మొదటి విడతగా రూ.1.50లక్షలు లంచం తీసుకున్నాడు. మిగిలిన రూ.70వేలు డబ్బులు తీసుకొని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతనివద్ద నుంచి డబ్బులు తీసుకుంటూ ఉండగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకొని డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఏ ప్రభుత్వ అధికారి సిబ్బంది అయినా లంచం అడిగినట్లయితే ప్రజలు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదుదారులు, బాధితుల వివరములు గోప్యంగా ఉంచబడుతాయని ఎసిబి డిఎస్పి శ్రీధర్ తెలిపారు.



## ప్రకృతి విపత్తు సహాయాన్ని రూ.50 వెల నుండి రూ.4 లక్షలకు పెంచడంపై హర్షం..

**-సీఎం రేవంత్ రెడ్డికి.. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన నియోజకవర్గ కాంగ్రెస్ యువ నేత సాయి చరణ్ రెడ్డి...**

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ ఏప్రిల్ 15**
జాతీయ విపత్తు పథకం ద్వారా ప్రమాదం బాధితులకు ప్రభుత్వం అందించే సహాయాన్ని రూ : 50వేల నుంచి 4 లక్షలకు పెంచడంపై హర్షం చేసిన CM రేవంత్ రెడ్డి కి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి కి నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకులు సాయి చరణ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఖిల్లా గణపురం కాంగ్రెస్ యువనేత ఆగారం ప్రకాష్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.
తీవ్రమైన ఎండలు, వడగాలులు, వడదెబ్బ వంటి కారణాలతో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు ఆదుకోవడానికి రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించడానికి వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే గతంలో రూ. 50 వేలు చెల్లించడానికి వీలుండేది. రాష్ట్ర విపత్తు సహాయ నిధి SDRF కింద ప్రస్తుతం ఆ ఎక్స్ గ్రేషియాను రూ : 50 వేల నుంచి రూ : 4 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 5 ను విడుదల చెయ్యగా తేదీ 15 తేదీ బుధవారం రోజు న ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది..

# హిందువులు సనాతన ధర్మం, ఐక్యత పాటించాలి

**-శ్రీ దక్షిణ కాశికాంబ సమేత కమటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**
**-భక్తులకు ఆలయం వద్ద అన్న ప్రసాదం**
**-సనాతన ధర్మం విశిష్టతలను భక్తులకు తెలిపిన జగద్గురు శ్రీ శ్రీ కాంతేంద్ర గురు స్వాములు**



**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 15**
వనపర్తి హిందువులు సనాతన ధర్మంతోపాటు ఐక్యమత్యం పాటించాలని హిందు ధర్మ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని జగద్గురు శ్రీ శ్రీ కాంతేంద్ర గురు స్వామి అన్నారు.వనపర్తి జిల్లా కేంద్రంలోని పాతబజార్ శ్రీ దక్షిణ కాశికాంబ సమేత కమటేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ట వేడుకల్లో భాగంగా మంగళవారం వేద పండితుల మంత్రాల మధ్య పూజలు వైభవంగా జరిగాయి. రోడ్ల విస్తరణలో కాళిమాత ఆలయాన్ని తొలగించడంతో ప్రస్తుతం పునః ప్రతిష్ట మహోత్సవ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా చేపడుతున్నారు.ఈ క్రమంలో ఒక్కొక్క క్రతువు యొక్క ప్రాధాన్యతను జగద్గురు శ్రీ శ్రీ కాంతేంద్ర గురు స్వామి భక్తులకు వివరిస్తూ సనాతన ధర్మం యొక్క విశిష్టతలను తెలిపారు.హిందు ధర్మ పరిరక్షణపై ఆధ్యాత్మిక ప్రవచనలు చేశారు.సనాతన ధర్మాన్ని పాటించాలని... ధర్మం యొక్క విశిష్టత గురించి సమాజానికి,నేటి తరాలకు తెలియజేయలన్నారు. పుట్టిన రోజు వేడుకల్లో దీపాలు ఆర్పి,కేకు కట్టింగ్ వంటివి చేయకూడదని..వృధా ఖర్చు చేయకుండా సాటి వారికీ సాయం చేసినప్పుడే మన జన్మ సార్ధకం అవుతుందన్నారు.మొదట ఆలయ ప్రాంగణం వద్ద ఉదయం భక్తులు హోమాలు చేశారు.సుప్రభాత సేవ, సహస్ర నామ పూజలు, విగ్రహ పంచామృత స్నానం, జలదివాసం, క్షిరాదివాసం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద స్వీకరణ, సాయంత్రం శ్రీ దక్షిణ కాశికాంబ సమేత కమటేశ్వర స్వాముల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది.కాళీ కాంబ అమ్మవారి నామ స్మరణలతో పూజ కార్యక్రమానికి ప్రవాహంలా తరలి వచ్చిన భక్తులతో పాత బజార్ కాలనీ అంత కాషాయి వర్ణంగా మారింది





# అంగన్వాడి కేంద్రంలో శ్యామ్ మామ్ కార్యక్రమం నిర్వహించిన రామచంద్రమ్మ టీచర్

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 15**
వనపర్తి జిల్లా కేంద్రం లో పీర్ల గుట్ట ఒకటవ అంగన్వాడీ కేంద్రం లో శ్యామ్ మామ్ అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు లో పిల్లల తల్లితండ్రులకు శ్యామ్ మామ్ కానీ పిల్లల లో పోషణ లోపల గురించి చెప్పారు. ఈ లోపం ఉన్న పిల్లలు మానసికంగా శరిరకరంగా ఎదుగుదల కూడా తక్కువగా ఒంటుంది అలాగే బరువు కూడ తక్కువ ఒంటుంది అని చెప్పారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న అంగన్వాడీ టీచర్స్ రామచంద్రమ్మ , విద్యుల్లాత, కృష్ణవేణి ఆయా ఉమా బాయ్ మరియు పిల్లల తల్లి తండ్రులు పాల్గొన్నారు.





# లాంగ్‌లిస్టులూ... షార్ట్‌లిస్టులూ....

ఆంధ్రప్రదేశ్‌లో వందల ఉగాది పురస్కారాల హడావిడిలో రచయితలు ఉండగా, తెలంగాణలో కంచ గచ్చిబౌలి స్థలాలకు సంబంధించి తమ పర్యావరణ స్పృహను సోషల్ మీడియా పోస్టులతో వెల్లడించే పనిలో సాహితీకారులు ఉండగా దేశాన కొన్ని ఆసక్తికరమైన సాహితీ ఘటనలు చోటు చేసుకున్నాయి. తన మానాన తానుంటూ తన రాతేదో తాను రాసుకుంటూ వచ్చిన హిందీ కవి వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ పురస్కారం ప్రకటించడం వాటిలో ఒకటి. ఆయన సీదాసాదా మనిషి. రచనల శీర్షికలు కూడా బహు సరళంగా ఉంటాయి. 'పనివాడి అంగీ'... 'గోడలో ఒక కిటికీ ఉండేది'... వినోద్ కుమార్ శుక్లా మొదట రచ్చ గెలిచారు.

ప్రతిష్ఠాత్మకమైన 'పెన్ నబకోవ్ అవార్డ్'ను 2023 సంవత్సరానికి గెలుచుకున్నారు. ఆ అవార్డు పొందిన ఏకైక భారతీయ కవి ఆయనే. కాబట్టి విలువైన ఆయన సాహిత్యానికి సర్వోత్కృష్ట జ్ఞానపీఠం దక్కడం అందరూ హర్షించారు. శుక్లా గారితో పోటీ పడినవారిలో ఒక తెలుగు పేరు ఉంది. జ్ఞానపీఠం షార్ట్‌లిస్టులో తెలుగు పేరు ఉండటం ఘనతే. రావూరి భరద్వాజ తర్వాత తాము జ్ఞానపీఠ పురస్కారానికి యోగ్యులమని భావిస్తున్నవారు ఉన్నారు. అయితే అలా యోగ్యులమని అనుకునేవారిలో కొందరి పేర్లు హడలిచచ్చేలా ఉన్నాయనే గిట్టనివారూ ఉన్నారు.

భారతదేశంలో స్థానికంగా గాని, జాతీయస్థాయిలో గాని షార్ట్‌లిస్టులలో పేరు చేరేవారు కొందరైతే చేర్పించుకునేవారు కొందరు. 'సాహిత్య అకాడెమీ అవార్డు' షార్ట్‌లిస్టుల్లో చేర్చబడ్డాయేమో అనిపించేలా కొన్ని పేర్లు చూసి ఆకలిదప్పులు మాని మంచం పట్టే సాహిత్యాభిమానులు ఉన్నారు. ప్రతిఏటా ఈ షార్ట్‌లిస్ట్ వీరి పాలిట ప్రాణాంతకంగా మారడం ఆందోళనకరం.

అయితే అంతర్జాతీయ స్థాయిలో ఇలా చేర్పించుకోవడం సాధ్యం కాదు. అందుకే కన్నడ నేలన ఇప్పుడు సంబరాలు సాగుతున్నాయి. కారణం 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' షార్ట్‌లిస్ట్‌లో మొదటిసారి కన్నడ పుస్తకానికి చోటు దక్కింది. సీనియర్ కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ రాసిన కథాసంపుటి 'హార్ట్ ల్యాంప్' ఈ షార్ట్‌లిస్టులో ఉంది.

యాక్టివిస్ట్‌గా ఉంటూ దళిత, మైనార్టీ మహిళా జీవితాలను ఎక్కువగా రాసే బాను ముష్తాక్ పుస్తకంతో పాటు కేవలం 6 పుస్తకాలతో ఉన్న షార్ట్‌లిస్ట్ నుంచి మే 20న విజేతను ప్రకటిస్తారు. 50 లక్షల రూపాయల బహుమతి ఉంటుంది. అదొక్కటే కాదు ఆ నవల ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు చేరువవుతుంది. బాను ముష్తాక్ గెలిస్తే కన్నడ భాష ఘనతకు మరో నిదర్శనమవుతుంది. ఇలాగే 2022లో 'రేత్ కీ సమాధి' నవల ఇంగ్లిష్ అనువాదం 'టూంబ్ ఆఫ్ శాండ్'కు గీతాంజలిశ్రీ బుకర్‌ప్రైజ్ గెలుచుకున్నారు. అప్పుడుగాని ఇప్పుడుగాని తెలుగు నవల, కథ ఈ దారుల్లోకి రాకపోవడం మన వరకూ ఘనతే.

ప్రపంచ దేశాలలో తెలుగు రాష్ట్రాలలో ఒక జిల్లా అంత ఉన్నవారు, హైదరాబాద్ జనాభా అంత సంఖ్యలో భాషను మాట్లాడేవారు, మన దేశంలో పదేళ్ల కాలంలో కేవలం యాక్సిడెంట్లలో మరణించేంతమంది మాత్రమే రాసే, చదివే భాష ఉన్నవారు కూడా అంతర్జాతీయస్థాయి అవార్డుల లాంగ్‌లిస్టులలో, షార్ట్‌లిస్టులలో కనిపిస్తారు. రెండు కోట్ల మంది జనాభా ఉన్న శ్రీలంక నుంచి ఎందరో అంతర్జాతీయ స్థాయి రచయితలు ఉన్నారు. పది కోట్ల తెలుగు జనాభా నుంచి అంతర్జాతీయ అవార్డుల సంగతి అటుంచి పెంగ్విన్ వంటి ప్రసిద్ధ పబ్లిషర్ల వరకూ చేరే రచనలు ఎన్ని... రచయితలు ఎందరు?

'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' కోసం 12 దేశాల నుంచి 13 మంది రచయితల పుస్తకాలు లాంగ్‌లిస్ట్ అయ్యాయి. విశేషం ఏమిటంటే వీరంతా మొదటిసారి నామినేట్ అయినవారు. బోణి కొట్టి తమ ఉనికి చాటినవారు. వీరి నుంచి ఆరు మందితో షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించారు. ఆ షార్ట్‌లిస్ట్‌లో కన్నడ నుంచి బాను ముష్తాక్ ఉన్నారు. షార్ట్‌లిస్ట్‌ను ప్రకటిస్తూ బుకర్ ప్రైజ్ కమిటి యు.కె.కు చెందిన ట్రాన్స్‌లేటర్ సోఫీ హ్యూస్‌ను ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆమె అనువాదం చేసిన రచనలు ఇప్పటికి ఐదుసార్లు లాంగ్‌లిస్ట్‌లో మూడుసార్లు షార్ట్‌లిస్ట్‌లో వచ్చాయి. ఇది రికార్డు. ఇక్కడే తెలుగు వారి ఘనత ఉంది.

తెలుగు పుస్తకాలు గతంలో కాని వర్తమానంలోగాని ఇంగ్లిష్‌లో గట్టిగా అనువాదం చేసేవారి సంఖ్య చేతి వేళ్లకు మించి లేకపోవడమే ఆ ఘనత. విదేశాలకు లక్షలమంది తెలుగువారు పైచదువులకు వెళ్లినా వారిలో సాంకేతిక విద్య, దాని వల్ల వచ్చే సంపద లక్ష్యంగా కనిపిస్తుంది గాని లింగ్విస్టిక్స్ చదవడం, ఇతర భాషలు నేర్చి తెలుగు సాహిత్యాన్ని అనువాదం చేయడం అనేదే లేదు. మిగిలిన భాషల వారు ఈ పని చేస్తున్నారు. ప్రపంచ భాషలు నేర్చి తమ సాహిత్యానికి వాహకులుగా మారుతున్నారు. సోఫీ హ్యూస్‌లాంటి వారు మనలో తయారవ్వాలి లేదా మన కోసం రావాలి.

సిఫార్సులు, పైరవీలు లేకుండా... గ్రూపులూ గుంపులూ కట్టకుండా మంచి సాహిత్యం కోసం కృషిని లగ్నం చేసిన తెలుగు రచయితలు ఉన్నారు. ప్రపంచం దృష్టికి వెళ్లాల్సిన రచనలు వీరివి కొద్దిగా అయినా సరే ఉన్నాయి. స్థానిక రాజకీయాలకు ఎడంగా జరిగి దేశీయంగా, అంతర్జాతీయ స్థాయిలో మనమేంటి, మనమెక్కడ అనే ఆలోచనతో సాహితీ పరివారం మేలుకోవాల్సిన తరుణం ఇది.

రచయితలు, అనువాదకులు, పబ్లిషర్లు, యూనివర్సిటీలు... దండు కట్టి దృష్టి పెట్టగలిగితే నేడు కన్నడ సీమలో జరుగుతున్న సంబరాలు తెలుగులో జరక్కపోవు. షార్ట్‌లిస్టులలో చేరాల్సిన వారి గురించి పట్టకపోతే చేర్చబడేవారే మన ప్రతినిధులుగా కాన వస్తారు. ప్రస్తుతానికి లక్ష్యం క్రోసులకొద్ది దూరం. మొదటి అడుగు పడితే గమ్యం ఎంతసేపని?


# అంబేడ్కర్ తాత్త్వికతకు ఆనాటి కవితాభాష్యం

జాతీయోద్యమం, తదనంతర వామపక్ష, విప్లవోద్యమాల నేపథ్యంలో వెలువడిన కవిత్వంలో మహాత్మా గాంధీ, కారల్ మార్క్స్, లెనిన్, మావోల ప్రభావం ప్రగాఢంగా కనిపిస్తుంది. ఈ దిశగా కొంత పరిశోధన జరిగింది. ఆధునిక సాహిత్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రభావం గురించి సమగ్ర చర్చ జరగాల్సిన అవసరముంది. సమకాలీన సంక్లిష్ట సందర్భానికి ఈ చర్చ దారిదీపంలా వెలుగునిస్తుంది. రాజ్యాంగ నైతికత దిశగా సృజనకారులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. ఆది ఆంధ్ర ఉద్యమం నుండి ఈనాటి దళిత ఉద్యమం వరకూ వెలువడిన వందేళ్ల సాహిత్యంలో అంబేడ్కర్ స్ఫూర్తిని విశ్లేషిస్తేనే తెలుగు విమర్శ పరిపుష్టమవుతుంది. కుసుమ ధర్మన్న నుండి ఈనాటి దళిత కవుల వరకూ ఎంతోమంది అంబేడ్కర్ ఆశయాలను సముచితంగా కవిత్వీకరించారు. అంబేడ్కర్ తాత్త్వికతను శ్వాసగా ఏకైక ధ్యాసగా భావించి ప్రభావశీలమైన కవిత్వం, పాటలు రాసిన ప్రజాకవి రావూరి ఏకాంబరం. నిబద్ధుడైన 'భీమ' కావ్యకర్తగా కార్యకర్తగా అణగారిన వర్గాల్లో ఏకాంబరం అనంత చైతన్యాన్ని కలిగించాడు. అంబేడ్కర్ సిద్ధాంతాన్ని 'సిరానిష్టం' చేసుకొన్న ప్రజాకవి రావూరి ఏకాంబరం, కృష్ణా జిల్లా పామర్రు సమీపంలోని నల్లకుంట గ్రామంలో 1924 సెప్టెంబర్ 24న జన్మించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబంలో పుట్టిన ఏకాంబరం ఎంతో కష్టపడి కాకినాడ పిఆర్ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించాడు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పౌర సంబంధాల అధికారిగా 20ఏళ్ళ సేవలందించాడు.

గన్నవరం శాసన సభ్యుడిగా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ పార్టీ నుండి పుచ్చలపల్లి సుందరయ్యపై పోటీ చేసి ఓడిపోయాడు. అంబేడ్కర్ అడుగుజాడల్లో మడమ తిప్పకుండాసాగిపోయిన ఈ ధన్యజీవి 2001 ఏప్రిల్ 21న తుదిశ్వాస విడిచాడు. విజయవాడ, గుడివాడ ప్రాంతాల్లో 1944లో జరిగిన బహిరంగ సభల్లో అంబేడ్కర్ ఆంగ్ల ప్రసంగాన్ని తెలుగులోకి అనువాదం చేసిన ఏకాంబరం, ఆ మహా నాయకుని దృష్టిని ఆకర్షించాడు. ఈ సందర్భంలోనే ఏకాంబరం రాసిన ''డాక్టరో అంబేడ్కరా! నీ నాయకత్వం లోకమెల్లను మేలు కొల్పెను'' అనే పాట ఉభయ గోదావరి జిల్లాల్లో 'భీమ' మంత్రమై మారుమోగింది. ''ఇంత పెద్ద విశాలదేశము/ సెంటు భూమి మాకు లేదు/ కసవు గుంటలే కాపురాలు/ జోరుగా పెనుగాలి వీచెను/ బోరుమని జడివాన కురిసెను/ కూలి నాలి జనాళి కొంపలు/ కూలిపోతే కష్టమెవరికి/ మాలవాడని మాదిగోడని మారు పేరు చండాలుడాయని/ మాల మాదిగ లేకమైతే మారిపోదా కాలచక్రం'' అంటూ లయాన్వితంగా సాగే ఈ పాటకు నేటికీ ప్రాసంగికత ఉంది. చోడగిరి చంద్రరావు వందలాది సభల్లో ఈ పాటను ఆలపించి, ప్రజలను ఉర్రూతలూగించాడు. ఈ పాట విని అంబేడ్కర్ ఆనంద పరవశుడై కన్నీరు పెట్టుకున్నాడని పొనుగుమట్ల విష్ణుమూర్తి తన పరిశోధనా గ్రంథంలో రాశాడు.

రావూరి ఏకాంబరం ఆశు కవి. ప్రజాసమూహంలో పర్యటించే క్రమంలో సందర్భానుసారంగా ఆశువుగా, భావగర్భితంగా ఎన్నో పద్యాలు, పాటలు ఆలపించేవాడు. 1944 నుండి 1980 వరకూ ఏకాంబరం ఎన్నో పద్యాలు, పాటలు రాశాడు. వీటిలో చాలావరకు పత్రికల్లో ప్రచురితం కాకపోయినప్పటికీ పాత తరం అంబేడ్కరీయుల గుండె గొంతుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 1984లో రావూరి ఏకాంబరం సాహితీ ప్రచురణ కమిటీ ఏర్పడి ఆయన పద్యాల్లో కొన్నింటిని సేకరించి 'అంబేడ్కరో సమర సింహ' పేరుతో పద్యకవితల సంకలనాన్ని ప్రచురించారు. 46 పద్య కవితలున్న ఈ సంకలనం ఎంతో విలువైనది. జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య, బొజ్జతారకం విశ్లేషణాత్మకమైన ముందు మాటలు రాశారు. ఆంధ్ర ప్రాంతంలో అంబేడ్కర్ పర్యటించడానికి మూలకారకుడైన నందనార్ హరికి ఈ గ్రంథాన్ని అంకితం చేశాడు కవి. అంబేడ్కర్ ఔన్నత్యాన్ని, ఆయన బహుముఖీన ఉద్యమ కార్యాచరణ ఆవశ్యకతను, దేశ పునర్నిర్మాణానికి అవసరమైన సాంస్కృతిక విలువలను ఈ కావ్యం ద్వారా ఏకాంబరం చాటిచెప్పాడు. ''నీ మహోజ్వల నిరుపమ నిర్విరామ/ సర్వతోముఖ విప్లవ సమర జ్వాల/ సమతకు పునాది వేసెను భీమ రాయ! భావ విప్లవ సామ్రాజ్య సార్వ భౌమ'' అంటూ, నాలుగు దశాబ్దాల పాటు సాగిన అపూర్వమైన అంబేడ్కర్ పోరాటాన్ని నాలుగు పాదాల్లో ఏకాంబరం సముచితంగా పద్యీకరించాడు.

''దేశభక్తుడెవడొ, దేశద్రోహియెవడొ/ గతచరిత్ర తవ్వి కథలు చెప్పి'' పాలకులకు అంబేడ్కర్ దిక్సూచిగా నిలిచాడని ఈ కవి నిర్ధారించాడు. కులం, మతం, సంస్కృతి, భగవద్గీత, ప్రజాస్వామ్యం, బ్రాహ్మణవాదం, ప్రతిభ, గాంధీతత్త్వం, రిజర్వేషన్లు, కులాంతర వివాహాలు తదితర అంశాలను అంబేడ్కర్ ఆలోచనల వెలుగుల్లో ఈ కవి నిర్వచించాడు. వాటి చుట్టూ రాజకీయ రహస్యాలను బట్టబయలు చేశాడు. ఈ పద్య కవితా సంపుటి అంబేడ్కర్ తాత్త్వికతకు ఒక సాహిత్య మేనిఫెస్టోలాగా, రావూరి ఏకాంబరం నిశిత విమర్శనా శక్తికి అక్షర దర్పణంలా కనిపిస్తుంది. నిష్ఠురమైన నిజాలను, కఠినమైన వాస్తవాలను, ఆచరణ యోగ్యమైన సామాజిక సత్యాలను తన పద్యాల ద్వారా కవి తేటతెల్లం చేశాడు.



''బోధిసత్వుపైన పోటీగా బ్రాహ్మణుల్/ మాంస భక్షణమును మానివేసి/ మాంసభక్షకులని'' (గో మాంస భక్షణ) అంటరాని ప్రజలను వెలివేశారని బౌద్ధానికి వ్యతి రేకంగా రగిలిన అలనాటి కుహనావ్యూహాలను కవి తెలియ పరిచాడు. 'పీడిత జననేత భీమరాయ!', 'భీమరాయ అంబేడ్కరో సమరసింహ!' లాంటి మకుటాలతో శతక శైలిలో ఏకాంబరం ఈ కావ్యాన్ని రచించాడు. 'విశ్వకళ్యాణదాయక', 'విప్లవాలరేడ', 'దళిత సాహితీ విధాత', 'నవ్య బౌద్ధధర్మ కావ్యశిల్పి' లాంటి ఔచితీమంతమైన విశేషణాలు అంబేడ్కర్ అసాధారణ మూర్తిమత్వానికి నిదర్శనంగా కనిపిస్తాయి. ప్రాచీన, ఆధునిక సాహిత్యధోరణులపై ఏకాంబరం కన్నెర్రజేశాడు. బాస, కాళిదాస, వ్యాస, వాల్మీకులు వస్తుపరంగా ఒకే మూస పద్ధతిలో కావ్య రచన గావించారని, ''బ్రాహ్మణాధిక్యమున్, బ్రాహ్మణోద్ధరణ మున్ బోధించు గ్రంథాలు'' (వ్యాసాదులు) రాసారని తద్వారా ''బ్రాహ్మణేతరులను మానసిక బానిసలుగా'' మార్చి వేశారని ఏకాంబరం తీవ్రంగాఆరోపించాడు.

''పాలు బోసి పెంచు పాడు సాహిత్యము/ మూఢ నమ్మకాలు ముదిరిపోవ'' అంటూ అంధవిశ్వాసాలను పోషించేది పాడు సాహిత్యమని కవి త్రోసిపుచ్చాడు. సాహిత్యాన్ని మలుపు తిప్పిన అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం పరిమితులను సాహసోపేతంగా ప్రశ్నించాడు. సాహిత్యంతో సమరభేరి మోగించిన ప్రగతి శీల రచయితలకు ''దండెత్త కులముపై దమ్ములు లేవని'' వాదించాడు. ''అడ్డుగోడ కులము, అడ్డమస్పృశ్యత/ వర్గదృష్టి జంపు, ప్రగతి జంపు/ అడ్డుగోడ మరిచి అరచెదరేలరా!'' (అరసం, విరసం) అంటూ కుల మనే అడ్డుగోడలు కూల్చకుండా విప్లవం విజయవంతం కాదని చెప్పిన అంబేడ్కర్ దృష్టితో ఏకాంబరం రచయితలను నిరసించాడు. ''మార్క్సును స్మరియించు, మావోను స్మరియించు/ పిల్లి మొగ్గలేయు కుల మద్దు పడగానే'' అని మేధావుల వైఖరిని దుయ్యబట్టాడు. ''పిట్సుబర్గులోన వెంకన్న ప్రతిమను/ దర్శనంబు చేసి పరవశించు/ శ్రీశ్రీయా మార్క్సిస్టు?'' అని మహాకవిని కూడా నిలదీశాడు. దళితేతరులు అంబేడ్కర్ స్మారక సభలను, వైశ్యేతరులు గాంధీ సభలను, కమ్మజనేతరుల్ త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారక సభలను నిర్వహించినపుడే విశ్వ సోదర భావము వెల్లివిరుస్తుందని ఈ కవి పిలుపునిచ్చాడు. దళిత విద్యావంతులు, మేధావులు తమ జాతి లోని నిరుపేదల, నిరక్షరాస్యుల ఉద్ధరణకు ఏమాత్రం పాటుపడటం లేదని చివరి దశలో అంబేడ్కర్ బాధపడ్డాడు.

''దళిత మేధావులు దాసానుదాసులైరి/ దళిత మేధావులు దండగ సరుకైరి, దళితుల తెగనమ్ము ద్రాష్టులైరి'' అంటూ ఏకాంబరం విమర్శించాడు. దళిత ప్రతినిధులు పాలక 'పార్టీల పాలేర్లు'గా మారిపోతున్నారని ఆవేదన చెందాడు. ఈ మేధావులు దండకమ్ములు మాని, దళితుల చరిత్రను వెలికి తీయాలని, దాస్యభాష్యాలు మాని సూటిగా సత్యాలు తెలియచెప్పాలని హితవు పలికాడు. ''నీవు పెట్టిన భిక్షకు నిజము తండ్రి! కుక్క మూతి పిందెలు కాచెనకట! అని కవి వాపోయాడు.'' ''దాస్య జాడ్య జనిత దౌర్భాగ్య శేఖరుల్'' అని తన జాతి జనులను ఆగ్రహంగా నిందించాడు. ''సిద్ధాంతములు నాస్తి, రాద్ధాంతములు జాస్తి/ సిగపట్లు జాస్తయ్యె సిగ్గులేక/ స్వార్థ ప్రయోజనాల్, బహునాయకత్వాలతో'' అంబేడ్కరీయులే అంబేడ్కరీయులకు ఆగర్భశత్రువులగా మారుతున్నారని ఆత్మ విమర్శ దృక్కోణంలో నుండి ఆరోపించాడు. బహుజనులకు మాల మాదిగలన్న చులకన అని, పై కులాలకు వీరు పచ్చి బానిసలని, కులపిశాచిని కూల్చంగా కలిసి రావాలని బహుజనులకు కవి పిలుపు చెప్పాడు. ''మతకలహాలలో మృతి చెందు బహుజనుల్/ అగ్రకులోన్మాదులాదరికె రారు'' అని మతకలహాల్లోని హింసను వ్యతిరేకించాడు. ప్రత్యేకంగా తెలుగు భాషా సాహిత్యాలను, వ్యాకరణాన్ని అధ్యయనం చేయనప్పటికీ ఏకాంబరం ప్రతిభావంతంగా పద్య రచన చేశాడు. పంచమాత్రా గణాల ప్రయోగంతో అలవోకగా సీస పద్యాలను పాఠకుల హృదయ క్షేత్రాల్లో కదం తొక్కించాడు. ప్రజాకవుల పాటల్లా వ్యవహారిక భాషలో ఆటవెలది, తేటగీతి పద్యాలను తీర్చిదిద్దాడు. కావ్య శిల్పానికి ప్రాధాన్యత నివ్వకుండా జనజాగృతియే ధ్యేయంగా, అంబేడ్కర్ ఆశ యాల ప్రచారానికి, దళిత చైతన్యానికి వాహికగా పద్యాన్ని మలుచుకున్నాడు. నిశిత భావ ప్రకటనకు యతి ప్రాసలు ప్రతిబంధకమైన సందర్భంలో ఛందో నియమాలను కూడా ధిక్కరించాడు. అర్ధశతాబ్దం క్రితమే స్పష్టమైన అంబేడ్కర్ దృక్పథంతో, ప్రగాఢమైన భావ సాంద్రతతో రావూరి ఏకాంబరం రాసిన 'అంబేడ్కరో సమరసింహ' కావ్యం సమకాలీన సాహిత్యానికి గొప్ప స్ఫూర్తిని అందిస్తుంది.

# చెట్లు కుములుతున్న దృశ్యం

నగరం అప్పుడప్పుడే మేలుకుంటున్న వేళ డాబా మీదికి వెళ్ళి చూడండి: ఎప్పుడు మేలుకున్నాయో తెలియదు, ఎలా వచ్చాయో తెలియదు, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద చెట్ల మీద, చిన్న చిన్న మొక్కల మీద, ఎక్కడబడితే అక్కడ చిన్నాపెద్దా పక్షులు, రంగురంగుల బుల్లి బుల్లి పిట్టలు! అవి నిర్విరామంగా కిచకిచల ధ్వనులు చేస్తూనే ఉంటాయి. అవి వాటితో అవి మాట్లాడుకోవడం; ఒకరి ఉల్లాసాన్ని ఒకరు పంచుకోవడం; కొమ్మమీంచి కొమ్మకు, ఆకుమీంచి ఆకుకు గెంతుతాయి,మందారపుష్పాల మెత్తని కేసరకాండాన్ని పట్టుకుని ఊగుతాయి.

అది వాటి క్రీడావినోదం. అది కూడా కాసేపే! ఉషఃకాలపు పిల్లగాలులు చల్లచల్లగా వీస్తున్నప్పుడు, సూర్యుడు పూర్తిగా పొడుచుకు రానప్పుడు, పరిసరాలు వేడెక్కనప్పుడు, మరీముఖ్యంగా మానవ సంచారం మొదలవనప్పుడు! ఆ తర్వాత అవి అదృశ్యం! ఎక్కడికెడతాయో తెలియదు, రోజంతా ఎక్కడుంటాయో తెలియదు!

వాటి గురించి ఎప్పుడైనా క్షణకాలం ఆలోచించి చూడండి, అప్పుడేమనిపిస్తుంది? బహుశా, ఎప్పుడో వేల సంవత్సరాల క్రితం మానవ ధూర్తరాష్ట్రులతో ఆడిన జూదంలో ఓడిపోయి జనారణ్యంగా మారిన తమదైన అరణ్యంలోనే అజ్ఞాతవాసం చేస్తున్న పాండవుల అనంత సంతతి కాదుకదా అనిపిస్తుంది. అవి రోజూ పొద్దుటే కాసేపు తమ కొమ్మల మీద, తమ ఆకుల మధ్య ఇంద్రధనువుల్ని ఆవిష్కరిస్తూ కోలాహలంగా తిరుగుతూ ఉంటే ఆ చెట్లకెంత సంబరం!

ఆ చెట్లూ, పిట్టలూ ప్రకృతి చరిత్ర పుటల్లోని తమ గురించిన అధ్యాయాలను మనిషి నిర్దాక్షిణ్యంగా చెరిపేసి పూర్తిగా సొంత అధ్యాయాలతో నింపేసుకున్న తర్వాత, కేవలం ప్రాచీన స్మృతులుగా మారిన తమ అనుబంధం గురించిన ఊసులు ఆ కాసేపూ నెమరేసుకుంటాయి కాబోలు! పక్షులతో పోల్చితే చెట్ల పరిస్థితి మరీ ఘోరం. అవి ఎగరనూ లేవు, ఆపైన వాటివి భారీకాయాలు కనుక అజ్ఞాతవాసయోగం కూడా వాటికి లేదు. తమ కొమ్మల మీద, తమ వేళ్ళ మీద మనిషి గొడ్డలి వేటు ఏ క్షణంలో పడుతుందోనన్న నిత్యభయగ్రస్త జీవితాన్ని నిలువు కాళ్ళమీద గడపక తప్పదు.



చెట్లు కూలుతున్న దృశ్యం గురించి, రాక్షసుని వెన్నెముకపై ప్రతిష్ఠించిన నగరం గురించి, నగరంలో మనిషి కంటక శరీరుడిగా మారడం గురించి, సర్వత్రా వినిపించే కఠోర శబ్దాలు,ధ్వంసక్రీడ, దగ్ధక్రీడల గురించి, పూల చెట్లు విలపించడం గురించి, నిద్రలో నడుస్తున్న మనిషి నెత్తుటి మడుగును దాటలేడని చెప్పి అవి శపించడం గురించి- కవి అజంతా రాస్తాడు. అవును, నిజమే, నిద్రలో నడుస్తున్న మనిషి ప్రకృతిలోని సమస్త జీవజాలం మనుగడనూ నెత్తుటి మడుగు చేశాడు, తను సృష్టించిన ఆ మడుగును తను కూడా దాటలేని పరిస్థితిని తెచ్చుకుంటూనే ఉన్నాడు.

ఒకప్పుడంతా అడవేనన్న సంగతి మరచిపోయి, నగరమే నిత్యమూ, సత్యమనే భ్రమలో పడిపోయాడు. చెట్లను కూల్చడం, వాటిని ఆశ్రయించుకున్న జీవజాలానికి నిలువనీడ లేకుండా చేయడమే అభివృద్ధి అని నిర్వచించుకుంటున్నాడు. తను కూడా భాగమైన ప్రకృతికి దూరమై ఒంటరివాడై పోతున్నాడు. అంతా తన ప్రయోజకత్వం, తానే భువికధినాథుడినని విర్రవీగుతున్నాడు.

తను నెత్తిన మోసే తన పౌరాణిక, ఇతిహాస వారసత్వం నుంచి కూడా మనిషి పాఠాలు నేర్చుకోవడం లేదు. ఎగిరే పర్వతాల గురించి, మానవరూపం ధరించి మాట్లాడే నదుల గురించి, మాట్లాడే పక్షులు, జంతువుల గురించి అవి చెబుతాయి. అది, నువ్వు కూడా ప్రకృతిలో భాగమే సుమా అని గుర్తుచేయడం; ప్రకృతిలో ఏ జీవీ ఎక్కువా కాదు, తక్కువా కాదు, అన్నింటికీ జీవించే హక్కు ఉందని చెప్పడం!

అడవులకు, అక్కడి సమస్త్ర పాణులకు రక్షణ కల్పించవలసిన అవసరం గురించి అర్థశాస్త్రం చెబుతుంది; అడవులూ, వాటిని ఆశ్రయించుకుని బతికే జీవులూ రాజ్యంలో భాగం కాని, స్వతంత్ర అస్తిత్వాలన్న సంగతిని ఆనాటి రాజుల వివేకం చెబుతుంది. ప్రాకృతికమైన పూర్తి అవగాహనతో పూర్వులు గీసిన ఈ లక్ష్మణ రేఖలన్నీ ఏమైపోయాయి? అడవిపై విచక్షణా రహితమైన రాజ్యపు రాబందు రెక్క పరచిందెవరు?!

సమకాలీన శాస్త్రవిజ్ఞాన పాఠాలు కూడా మనిషి తలకెక్కడం లేదు; ఈ విశ్వమూ, భూమీ,అందులోని ప్రకృతీ తమవైన ప్రణాళికను, తమవైన కేలండర్‌ను అనుసరిస్తాయనీ, మనిషి ప్రణాళికలనూ, కేలండర్‌నూ అవి ఏ క్షణంలోనైనా కుప్పకూల్చగలవనే ఎరుక లేదు. వందల కోట్ల సంవత్సరాల భూమి చరిత్రలో ఎన్నో మంచుయుగాలు దొర్లాయి. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వత విస్ఫోటాలు జీవి మనుగడను ఎన్నో మలుపులు తిప్పాయి.

ఎంతో చరిత్రను తిరగరాశాయి. జీవపరిణామం ఎన్నో మార్పులు చెందింది. మానవ పరిణామంలో ఇప్పుడు చూస్తున్నదే తుది అంకం కాదు, మరిన్ని అంకాలకు అవకాశముందని జన్యుశాస్త్రజ్ఞులు హెచ్చరిక. మరి జంతువులు సహా ఇతర జీవజాలం సంగతేమిటి? మనిషిలోలానే వాటిలో కూడా ఏదైనా ఉత్పరివర్తన జరిగి అవి మనిషి స్థానాన్ని ఆక్రమిస్తే?!

అది ప్రస్తుతానికి విపరీత ఊహలా అనిపించవచ్చు, కానీ ప్రకృతి గర్భంలో ఏ రహస్యాలు దాగున్నాయో ఎవరికి తెలుసు? కనుక మనిషి నేర్చుకోవలసింది వినమ్రత! ప్రకృతిపట్లా, అందులోని చరాచరాలన్నిటిపట్లా సమభావం, సమరసభావం!! పగబట్టి తిరగబడే ప్రకృతి ముందు తను పిపీలకమన్న ఆత్మజ్ఞానం!!

# నేడు పెద్దమందడి మండలంలో ఎమ్మెల్యే మెఘా రెడ్డి పర్యటన...

**–మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త కాపు రామకృష్ణారెడ్డి...**
**–ఐకెపి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే...**

**పెద్దమందడి సిటీ టైమ్స్ ఏప్రిల్ 15**



వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలంలో బుధవారం ఎమ్మెల్యే తుడి మేగా రెడ్డి పర్యటించను న్నారని వనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త కపు రామకృష్ణారెడ్డి తెలిపారు ఐకెపి ద్వారా ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని రామకృష్ణారెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. మొదటగా ఉదయం 9:30 అమ్మపల్లి 10:30 అల్వాల 11:00మనీగిళ్ల 11:30జగత్ పల్లి అల్వాల్ 12.చిన్నమందడి 12.30 దొడగుంటపల్లి వీరాయిపల్లి 1 గంటకు భోజనం 1.40 కి జం గామపల్లి లో మొదలగు కార్యక్రమాలు ప్రారం భించడానికి హాజరుకానున్నారని కావున పెద్ద మందడి మండలం లోని మాజీ ఎంపిపి లు మాజీ ఎంపిటిసి లు మాజీ సర్పంచ్లు వార్డు మెంబర్లు అదేవిధంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు సీనియర్ నాయకులు యువకులు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు ..

# నేడు జగత్ పల్లిలో ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ...

**కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలి..**
**కాంగ్రెస్ నాయకులు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెవ్వ గట్టు యాదవ్...**

**పెద్దమందడి సిటీ టైమ్స్ ఏప్రిల్ 15**

పెద్దమందడి మండల పరిధిలోని జగత్ పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించేందుకు వనపర్తి ఎమ్మెల్యే తోడి మెగా రెడ్డి హాజరుకానున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెవ్వ గట్టు యాదవ్ తెలిపారు.కావున గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదవ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.అలాగే గ్రా మానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల పై ఎమ్మెల్యే చర్చిస్తారని మహిళా సంఘాల సభ్యులు హాజరుకావాలనీ పిలుపునిచ్చారు.





# భారత రాజ్యాంగాన్ని, బాబా సాహెబ్ అంబేద్కర్‌ని కాపాడుకుందాం

**–జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తాం**
**–టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్**

**దమ్మాయిగూడ ఏప్రిల్ 15,(సిటీ టైమ్స్):**

ఏఐసీసీ పీసీసీ పిలుపు మేరకు మేడ్చల్ నియోజకవ ర్గం దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పా రామరావు ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప కాలనీ లో జై బాపు,జై భీమ్, జై సంవిదాన్ రాజ్యాంగ రక్షణ పాదయాత్ర నిర్వహించబడింది. ఈ కార్యక్ర మానికి మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, దానిని మార్చే కుట్రలు బిజేపి ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. అధిష్టానం ఆదేశాల మేరకు జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకుపో తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా పేరుతో పేద తరగతి విద్యార్థుల బౌషత్ మరబోతున్నదని తెలిపారు. పేద కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశ పెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అధ్యక్షులు కోలా కృష్ణ యాదవ్, మేడ్చల్ ని యోజకవర్గం బి బ్లాకు మహిళా అధ్యక్షురాలు ఈగా శ్వేతా,దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మహిళ అధ్యక్షురాలు శోభా రాణి,ఉపాధ్యక్షురాలు గుజ్జుక నర్మద పరుశురాం, దమ్మాయిగూడ మున్సి పల్ మాజీ వైస్ ఛైర్మెన్ నరేందర్ రెడ్డి,కీసర మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామిడి విజయ్ రెడ్డి, కీసర గుట్ట సభ్యులు ప్రసాద్ గౌడ్, మాజీ ఎం పీటీసీలు రమేష్ గుప్త, మంచాల ప్రవీణ్, సీనియర్ నాయకులు శివలింగాల శ్రీనివాస్, నర్సింగ్ రావు, శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ గౌడ్, లక్ష్మణ్ శర్మ , అనిల్ యాదవ్, గోవింద్ సింగ్, దిలీప్, జూపల్లి రవీందర్, యూనిస్,యూత్ నాయకులు సుమేష్, వినోద్, అరవింద్, మాజీ కౌన్సిలర్లు వెంకటేష్,మాజీ ప్రజా ప్రతినిధులు,మహిళా కాంగ్రెస్ తదితరులు పాల్గొ న్నారు.

# నేడు అల్వాల లో ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ...

**కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలి..**
**కాంగ్రెస్ నాయకులు. మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్ రెడ్డి**

**పెద్దమందడి సిటీ టైమ్స్ ఏప్రిల్ 15**



పెద్దమందడి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేం ద్రాన్ని బుధవారం ప్రారంభించేందుకు వనపర్తి ఎమ్మె ల్యే తూడి మెగా రెడ్డి హాజరుకానున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్ రెడ్డి తెలిపారు.కావున గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.అలాగే గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే చర్చిస్తారని మహిళా సంఘాల సభ్యులు హాజరుకావాలనీ పిలు పునిచ్చారు.

## అరెస్టు చేయరాదని ఉత్తర్వులిస్తే వారంలో వచ్చేస్తా

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**



ఫోన్‌ట్యాపింగ్ కేసులో తనను అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే వారంలో ఇండియా వచ్చేస్తానని ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వా లని కోరుతూ ఇప్పటికే దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు అనుబంధంగా మరో దరఖా స్తు చేశారు. ఆ దరఖాస్తుపై జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభాకర్‌రావు తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. ఇదే కేసులో నిందితు డిగా ఉన్న ఐన్యూస్ ఎండీ శ్రవణ్‌రావును అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. అదేతరహాలో ప్రభాకర రావును సయితం అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఆయన దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభు త్వం తరపున సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ.. ప్రభాకర్‌రావు పాస్‌పోర్ట్ రద్దయిందని, రెడ్ కార్నర్ నోటీసు జారీఅయిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆయన వారంలో తిరిగి వస్తానని ఎలా చెబుతారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ మధ్యంతర పిటిషన్ తమ రికార్డుల్లోకి రాలేదని తెలిపింది. వచ్చిన తర్వాత వాదనలు వింటామని పేర్కొంటూ విచారణను 25కు వాయిదా వేసింది.

## ప్రకృతి విపత్తు సహాయాన్ని రూ.50 వెల నుండి రూ.4 లక్షలకు పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం...

**సీఎం రేవంత్ రెడ్డికి.. దేవరకద్ర ఎమ్మెల్యే GMR కు కృతజ్ఞతలు తెలిపిన మదనాపురం మండల కాంగ్రెస్ యువ నేత వడ్డే రాములు..**

**మదనాపురం సిటీ టైమ్స్ ఏప్రిల్ 15**



జాతీయ విపత్తు పథకం ద్వారా ప్రమాదం బాధితు లకు ప్రభుత్వం అందించే సహాయాన్ని రూ : 50వేల నుంచి 4 లక్షలకు పెంచడంపై హర్షం చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి, దేవరకద్ర ఎమ్మెల్యే GMR కు మద నాపురం మండల కాంగ్రెస్ యువ నాయకులు వడ్డే రాములు కృతజ్ఞతలు తెలిపారు.

తీవ్రమైన ఎండలు, వడగాలులు, వడదెబ్బ వంటి ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కు టుంబాలకు ఆదుకోవడానికి ప్రభుత్వం రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించడానికి వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే గతంలో రూ. 50 వేలు చెల్లించడానికి వీలుండేది. రాష్ట్ర విపత్తు సహాయ నిధి SDRF కింద ప్రస్తుతం ఆ ఎక్స్ గ్రేషియాను రూ : 50 వేల నుంచి రూ : 4 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 5 ను విడుదల చెయ్యగా తేదీ 15 తేదీ బుధవారం రోజు న ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది..

# రైళ్లు ఇలా మళ్లిస్తున్నారు..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా 10వ నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి 7వ నంబర్ ప్లాట్‌ఫాం వరకు మూసివేశారు. అలాగే 5, 6వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లను కూడా అవసరాలకు అను గుణంగా మూసివేయనున్నారు. నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని ప్లాట్‌ఫామ్‌ల మూసివేత, రైళ్ల మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 120 రోజులపాటు రైళ్ల రాకపోకలపైన ఆంక్షలు కొనసాగే అవకాశం ఉంది.

**టెర్మినల్ మార్పు...**

నాంపల్లి నుంచి చెన్నై సెంట్రల్‌కు నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (12603/12604), సికింద్రాబాద్-గోర ఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (12590/12589), షాలిమార్- హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ (18045/18046) రైళ్లను చర్లపల్లి టెర్మినల్‌కు మార్చారు. సికింద్రాబాద్- కర్నూల్ సిటీ (17023/17024) కాచిగూడ నుంచి రాకపోకలు సాగించనుంది.

**తాత్కాలికంగా మారిన స్టేషన్‌లు...**

- `విజయవాడ-సికింద్రాబాద్ (12713/12714) ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి విజయవాడకు రాకపో కలు సాగించనుంది. పోర్‌బందర్-సికింద్రాబాద్ (20968/20967) ఎక్స్‌ప్రెస్‌ను ఉందానగర్ నుంచి నడుపుతారు.
- `అలాగే సిద్దిపేట్ నుంచి సికింద్రాబాద్ వరకు నడిచే ప్యాసింజర్ రైళ్లను సికింద్రాబాద్‌కు బదులు మల్కా జిగిరి నుంచి నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. సికింద్రాబాద్ నుంచి పుణేకు నడిచే శతాబ్ది ఎక్స్‌ప్రె స్ (12026/12025) నాంపల్లి నుంచి పుణేకు రా కపోకలు సాగించనుంది.
- `చర్లపల్లి నుంచి నడిచే రైళ్లు ఇవే...
- `సికింద్రాబాద్-మణుగూర్ (12745/12746), సికింద్రాబాద్-రేపల్లె (17646/17645), సిలిచర్-సికింద్రాబాద్ (12513/12514), సి కింద్రాబాద్-దర్భంగా (17007/17008), సికిం ద్రాబాద్-యశ్వంత్‌పూర్ (12735/12736), సికింద్రాబాద్-అగర్తల (07030/07029), సి కింద్రాబాద్-ముజఫర్‌పూర్ (05294/05293), సికింద్రాబాద్-దానాపూర్ (07647/07648), సికింద్రాబాద్-సంత్రాగచ్చి (07221/07222), హైదరాబాద్-రక్సాల్ (07051/07052) ఎక్స్‌ప్రెస్ రైళ్లు సికింద్రాబాద్ రీడెవలప్‌మెంట్ పనుల దృష్ట్యా చర్లపల్లి నుంచి రాకపోకలు సాగి స్తాయి.
- `అలాగే సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, గుంటూర్-సికింద్రాబాద్ రైళ్లకు చర్లపల్లి టెర్మిన ల్‌లో అదనపు హాల్టింగ్ సదుపాయం కల్పించారు.

**చర్లపల్లి నుంచి మళ్లింపు...**

వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా నడిచే 32 రైళ్లను చర్లపల్లి మీదుగా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ రైళ్లు సి కింద్రాబాద్‌కు రాకుండా లింగంపల్లి నుంచి సనత్‌న గర్, మౌలాలి రూట్‌లో చర్లపల్లికి చేరుకుంటాయి. ఆదిలాబాద్-తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి- కాకినాడ గౌతమి ఎక్స్‌ప్రెస్, కాజీపేట్-హడాప్సర్, లింగంపల్లి-విశాఖపట్టణం, సంబాల్పూర్-నాందేడ్, విశాఖపట్టణం-నాందేడ్, విశాఖపట్టణం-సాయిన గర్ షిరిడీ, విశాఖపట్టణం-నాగర్‌సోల్, నర్సాపూర్- నాగర్‌సోల్, వాస్కోడిగామ -జాసిడ్, మచిలీపట్నం- సాయినగర్ షిరిడీ, కాకినాడ-సాయినగర్ షిరిడీ, విశాఖపట్టణం-ఎల్‌టీటీ ముంబై, పూర్ణ-తిరుపతి, నాందేడ్-ఈరోడ్, కాకినాడ- లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైళ్లు చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

**చర్లపల్లికి కనెక్టివిటీ కటకట...**

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే సుమారు 60కి పైగా రైళ్లను చర్లపల్లి టెర్మినల్ నుంచి నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ ప్రయాణి కుల రద్దీ మేరకు బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు అందు బాటులో లేవు. ప్రస్తుతం ఒకే ఒక్క ఎంఎంటీఎస్ రైలు ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి చొప్పున నడుస్తు న్నాయి. చర్లపల్లి నుంచి సికింద్రాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు సిటీబస్సులు కూడా పరిమితంగానే ఉన్నాయి. పైగా రాత్రిపూట బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సికింద్రాబాద్ నుంచి తాత్కాలికంగా ఇతర స్టేషన్‌లకు మళ్లించిన రైళ్లు 30**
**శాశ్వతంగా చర్లపల్లి టెర్మినల్‌కు మారినవి 8**
**చర్లపల్లిలో అదనపుహాల్టింగ్ కల్పించిన రైళ్లు 6**
**సికింద్రాబాద్‌కు బదులు చర్లపల్లి మీదుగా నడిచే దూరప్రాంత రైళ్లు 32**



## విడాకులపై స్పందించిన

# మెలిండా గేట్స్..!

### ఆ ఏజ్‌లోనే విడిపోవడానికి కారణం..



**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**

ప్రపంచ అపరకుభేరుడు, మైక్రోసాఫ్ట్ విండోస్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, మెలిండా ఫ్రెంచ్ గేట్స్ దంపతులు అధికారికంగా విడిపోయిన సంగతి తెలిసిందే. 1994లో పెళ్లి చేసుకున్న ఈ జంట 2021లో తమ 27 ఏళ్ల దాంపత్యానికి స్వస్థి చెబుతూ విడిపోయారు. అయితే దీన్ని అతిపెద్ద విచారంగా పే ర్కొన్నారు బిల్‌గేట్స్. ఆ వ్యాఖ్యలపై ఎప్పుడు స్పందిం చలేదు మెలిండా ఫ్రెంచ్ గేట్స్. అయితే ఆమె తొలిసారి గా విడాకులు గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. మెలిండా తన మాజీ భర్త బిల్‌గేట్స్ మాటలకు నేరుగా స్పందించకపోయినప్పటికీ..పరోక్షంగా సమాధానమి చ్చారు. "అత్యంత సన్నిహిత బంధంలో విలువలతో జీవంచలేని పరిస్థితి ఎదురైతే విడాకులు తప్పనిసరి అవసరంగా అభివర్ణించారు. అయితే బిల్‌గేట్స్ వ్యాఖ్య లపై మాట్లాడనని నిర్మోహటంగా చెప్పేశారు. ఎందుకంటే అతనికి తనకంటూ సొంత జీవితం ఉంది. ఇప్పుడు నా జీవితం నాకు ఉంది. ప్రస్తుతం చాలా సంతోషంగా ఉన్నాను. నిజానికి విడాకులు అనేది భావోద్వేగ భారం అన్నారు." ఎందుకంటే ఆ సమయంలో తానెంతో తీవ్ర భయాందోళనలకు గు రైనట్లు తెలిపారు. వివాహం విడిచిపెడుతున్నప్పుడు.. చాలా కష్టంగా ఉంటుందన్నారు. ఆ సమయంలో జరిగే చర్చలన్నీ కఠినంగా ఉంటాయన్నారు. 2014లో గేట్స్‌తో కలిసి భోజనం చేస్తున్నప్పుడు అచ్చం అలాంటి బాధ, తీవ్ర భయాందోళనలు కలిగా యని అన్నారు.

అలాంటి సమయంలో వెంటనే ఇది సరైనది కాదా అని సానుకూలంగా ఆలోచించి..త్వరితగతిన బయటప డాలి లేదంటే ఉనికే ప్రశ్నార్థకంగా మారిపోతుందన్నా రు. ఆ తర్వాత తాను నెమ్మదిగా దాని విలువ అర్థం చేసుకుని నిశబ్దంగా నిష్క్రమించానన్నారు. అలాగే ఇక్కడ భయాందోళనలకు గురవ్వడం అంటే తాను దెబ్బతిన్నట్లు కాదని కూడా చెప్పారు. ఇక్కడ తాను గుర్తించాల్సిన కొన్ని కష్టమైన విషయాలను ఎదుర్కొ న్నానని అందువల్ల తనకు విడిపోవడం అనేది తప్పని సరి అంటూ మెలిండా విడాకుల తీసుకోవడానికి గల కారణాలను వివరించారు.

కాగా, ఈ జంటకు జెన్నిఫర్(28) రోరీ(25), ఫోబ్(22)లు ఉన్నారు. అంతేగాదు ఇద్దరు మనవరా ళ్లు కూడా ఉన్నారు. ఇక బిల్‌గేట్స్ 2022 నుంచి మాజీ ఒరాకిల్ సీఈవో మార్క్ హర్డ్ భార్య పౌలా హర్డ్‌తో డేటింగ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో లేటు వయసు విడాకులు ఎక్కువఅవుతున్నాయి. ఇన్నేళ్ల దాంపత్యం తర్వాత తాము ఏం కోల్పోయామో వెతుకుతూ విడి పోతున్నారు. మానసిక నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎందుకంటే..**

ఎంతోమంది సెలబ్రిటీలు, ప్రముఖులు పిల్లలు సెటిల్ అయిపోయాక విడిపోతున్నారు. మాకు స్పేస్ కావాలని కొందరూ..ఇనాళ్లు తన ఉనికే కోల్పోయాన ని కొందరూ అంటున్నారు. అన్నేళ్లు కలిసి ఉండటాని కి.. బాధ్యతలు, పిల్లలు వంటి తదితర కారణాలే గానీ ఎప్పుడో వాళ్ల మధ్య బంధం విచ్ఛిన్నమైందని, అందు వల్లే ఇలాంటి అనూహ్య నిర్ణయాలు తీసుకుంటారని చెబుతున్నారు మానసిక నిపుణులు.

ఏదీఏమైనా..ఆ పరిస్థితి ఎదురవ్వక ముందే భాగస్వా ముల్లో ఎవ్వరో ఒక్కరో దీన్ని గుర్తించి తమ బంధాన్ని కాపాడుకునే యత్నం చేయాలంటున్నారు. అలాగే మనతో సాగే సహచరులను నిర్లక్ష్యం చేస్తే..వాటి పర్వవసానం చివర్లో ఇలానే ఉంటుందని కూడా హె చ్చరిస్తున్నారు. నిజానికి వయసులో కంటే వృద్ధాప్యం లోనే తోడు ఉండాలని ఆ సమయంలోనే.. అసలైన దాంపత్యం ఇరువురి నడుమ ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు.




# ప్రారంభమైన భూభారతి పోర్టల్

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
భూభారతి పోర్టల్ రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం, నారాయణ పేట జిల్లా మద్దూరు మండలం, కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం, ములుగు జిల్లా వెంకటాపురం మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. భూమి రిజిస్ట్రేషన్లు, మ్యుటే షన్, నాలా మార్పులు, చేర్పులు, అప్పీల్, రివిజన్ తదితర సమస్యల పరిష్కా రానికి భూభారతి పోర్టల్ వేదిక కానుంది. పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తొలిరోజు మంగళవారం దీనిపై నేలకొండపల్లి తహసీల్‌లో అవగా హన సదస్సు నిర్వహించారు.
ఈ నెల 17 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నేలకొండపల్లి మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో రికార్డుల సవరణతో పాటు రైతుల భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ మండలంలో 37,405 ఎకరాల సాగు భూమి ఉండగా, సాదాబైనామా కింద 3,417 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ధరణిలో రిజి స్ట్రేషన్‌కు సంబంధించి 150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
వీటిని రెవెన్యూ అధికారులు భూభారతి ద్వారా పరిష్కరించనున్నారు. పలువురు రైతులు పోర్టల్ వివరాలు తెలుసుకునేందుకు తహసీ ల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ విషయమై నేల కొండ పల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభు త్వం భూభారతి పోర్టల్ ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు.
స్లాట్ బుకింగ్ విధానానికి వ్యతిరేకంగా..

**నేటినుంచి డాక్యుమెంట్ రైటర్స్ నిరసనలు**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచ నను విరమించుకోవాలని తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం విఫలమైందన్నారు. దీన్ని గుర్తించి స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
దీనివల్ల వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. దస్తావేజులు రాస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని, వారంతా రోడ్డున పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్రంలోని యాదగిరిగుట్ట, ఘట్‌కేసర్, నారపల్లి, మేడ్చల్, సంగారెడ్డి, రాజేంద్రనగర్, చంపాపేట్, ఎల్బీనగర్, చిక్కడపల్లి, మల్కాజిగిరి, చౌటుప్పల్, సూర్యాపేట, జనగామ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

**సర్వే మ్యాప్‌లు ఇప్పుడే కాదు!**

రాష్ట్రంలో కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం ద్వారా జరిగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఇప్పటికిప్పుడు సర్వే మ్యాప్‌లు అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అమల వుతున్న విధంగానే అవసరమైన డాక్యుమెంట్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతా యని వెల్లడించాయి. అయితే, ప్రభుత్వం భూమి మ్యాపింగ్ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇస్తుందని, అప్పుడు లైసెన్స్డ్ సర్వేయర్ల చేత సర్వే చేయించి, భూమి హద్దులను అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా నిర్ధారించి మ్యాప్ ఇస్తారని పేర్కొన్నాయి. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ల సమయంలో కచ్చితంగా సర్వే మ్యాప్ అవసరమవుతుందని, అప్పటివరకు మ్యాప్‌లు లేకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని తెలిపా యి. చట్టం మార్గదర్శకాల్లోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రభుత్వం నోటిఫై చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు మ్యాప్ అవసర మవుతుందని పలు సెక్షన్లలో ప్రస్తావించారు.

**పోర్టల్‌లో ఏం మారింది?**

ధరణి పోర్టల్ స్థానంలో వచ్చిన భూభారతిలో ఏముందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. సోమ, మంగళవారాల్లో ఈ పోర్టల్‌ను దాదాపు 2.20 లక్షల మంది వీక్షించారు. భూభారతి పోర్టల్ వెబ్‌పేజీపై ఎడమ వైపు సీఎం రేవంత్‌రెడ్డి, కుడి వైపున రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫొటోలు, మధ్యలో తెలంగాణ ప్రభుత్వ చిహ్నం, తెలంగాణ తల్లి ఫొటో ఉన్నాయి. ఆకుపచ్చ రంగు ఎక్కువగా కనిపించే ఈ పోర్టల్‌ను ఓపెన్ చేయగానే సీఎం రేవంత్‌రెడ్డి సందేశం కనిపిస్తోంది. ఆ తర్వాత పొంగులేటి సందేశం, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు (లాగిన్), సమాచారం (ప్రజల కోసం), భూధార్, భూమిత్ర, భూపరిపాలన శాఖ, ప్రభుత్వ భూముల రక్షణ, దస్తావేజు రిజిస్ట్రేషన్ మార్గదర్శకాల గురించిన వివరాలు పొందుపరిచారు. భూమిత్ర పేరుతో కొత్తగా చాట్‌బాట్ ఏర్పాటు చేసినప్పటికీ, అది ఇంకా అందుబాటులోకి రాలేదు. ధరణిలాగే ప్రజలు తరచూ అడిగే ప్రశ్నలు, వాటికి సమాధానాలను ఇచ్చారు. భూముల మార్కెట్ విలువ, భూముల వివరాలు, నిషేధిత భూములు, ఈ చలాన్, దరఖాస్తుల పురోగతి, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ) నేతృత్వంలో ఈ పోర్టల్‌ను తెలుగుతోపాటు ఇంగ్లిష భాషలో కూడా రూపొందించారు.

# పంచాయతీరాజ్‌శాఖ కార్మికులకు ఒకటో తేదీనే వేతనాలు

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 92 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, బిల్ కలెక్టర్‌లు, ఉపాధి హామీ ఉద్యోగులు, సెర్ప్‌లో పనిచేస్తున్న వీవోఏలకు నేరుగా ప్రభుత్వం నుంచి ప్రతి నేల వేతనాలు అందనున్నాయి. రెగ్యులర్‌ప్రభుత్వ ఉద్యోగులకు ఏ విధంగా అయితే ఒకటో తేదీన వేతనాలు జమ అవుతున్నాయో వీరికి ఇకపై వేతనాలు జమ కానున్నాయి. దీని కోసం ప్రభుత్వం గ్రీన్‌ఛానల్ వ్యవస్థను ఏర్పాటుచేసింది. ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూడోద్దు... పంచాయతీలకు వారి వేతనాలు భారం కావద్దనే ఉద్దేశంతో విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వీరికి వేతనాలు ఎప్పుడో వస్తాయో వారికే తెలిసేది కాదు. పండుగ ఉన్న, పబ్బం ఉన్న వారికి మాత్రం వేతనాలు మాత్రం సకాలంలో అందేవి కావు. 92,175 మందికి సకాలంలో జీతాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. ఏప్రిల్‌కు సంబంధించిన వేతనం మే 1న వీరికి వేతనం జమ కానుంది. వీరికి నెలకు రూ.115.35కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించనున్నారు. పంచాయతీల పరిధిలో పని చేస్తున్న 52వేల మంది పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీలే వారికి వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. అనేక పంచాయతీలకు నిధులు లేక నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయి.



ఈ నేపథ్యంలో వారి వేతనాలకు ఎలాంటి ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చొరవతో అమల్లోకి నూతనాన్ని ఆర్థిక శాఖకు ప్రతిపాదించారు. దీంతో ఆర్థిక శాఖ కూడా ఆమోదం తెలిపింది. దీంతో పంచాయతీలతో పనిలేకుండా నేరుగా వేతనాలు అందనున్నాయి. వారి బ్యాంకు అకౌంట్లను ఇప్పటికే సేకరించారు. వారి హాజరు వివరాలను ప్రతి నెల 25వ తేదీ వరకే సేకరిస్తారు. 26వ తేదీన వేతనాల బిల్‌ను జనరేట్ చేసి వేతనాలు అందిస్తారు. పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఆ నిధులను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలుగా ఇచ్చే వారు. లేదా స్థానికంగా పంచాయతీల్లో వసూలు బిల్లులు, ఇతర ఆదాయాల నుంచి వేతనాలు చెల్లించే వారు. ఇలా ప్రతి నెలా వారి వేతనాలకు ఇబ్బందులు, తిప్పలు తప్పడంలేదు. వారి కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వాటన్నంటికి స్వస్తి పలుకుతూ నూతన విధానాన్ని తీసుకవచ్చారు. నూతన విధానంతో మంచి ఫలితాలు వస్తాయని పంచాయతీరాజ్ శాఖ అంచనా వేస్తుంది.

# హైదరాబాద్ అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
హైదరాబాద్‌లో 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల "గ్రేడ్ ఏ" కమర్షియల్ స్పేస్‌ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌గచ్చిబౌలి నానక్ రాంగూడలో యూఎస్‌కు చెందిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్" గా మారిందని అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరిగిందన్నారు. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ తగ్గుతుంటే మన దగ్గర గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదయ్యిందన్నారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయన్నారు. హైదరాబాద్‌లో ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియంట్, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలుండగా 3 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలో 70కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయన్నారు. హైదరాబాద్ ను జీసీసీలకు హబ్‌గా మార్చడమే కాకుండా వాటిని ఇన్నోవేషన్, ఆర్‌అండ్ డీ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ తదితర అంశాల్లో సేవలు అందించే గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే పనిగట్టుకొని పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తమ జీసీసీని హైదరాబాద్ లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వేయి మంది ఐటీ, డేటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ ఎంటర్ప్రైజ్ టెక్నాలజీ, సెక్యూరిటీ మైకెల్, కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.

# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
ఈ ఏడాది దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సంవత్సరం దాదాపు 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగిందని, ఇది ఒక రికార్డు అని ఆయన తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'బియ్యం ఎగుమతి విధానం' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి ఉత్తమ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఘనతకు రైతుల కృషి, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, ప్రకృతి సహకారం, కొత్త వరి రకాలు అందుబాటులో ఉండటం కారణమని చెప్పారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.



రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం, కేంద్ర నిల్వల కోసం 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించిన తర్వాత కూడా, రాష్ట్రంలో ఇంకా 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులు ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఈ మిగులు ధాన్యాన్ని మార్కెట్ చేయడానికి అన్వేషణలో భాగంగా, ఆగ్నేయ ఆసియాలోని ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడానికి ఆ దేశ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎంటియు1010 మరియు ఐఆర్64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని, వీటికి ఫిలిప్పీన్స్‌లో అధిక డిమాండ్ ఉందని ఆయన తెలిపారు.
వరి సాగులో ఇటీవల రైతులు ఆదరిస్తున్న నేరుగా విత్తే పద్ధతి, రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం, తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ఆధునిక బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని, ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్‌గా గుర్తించి చర్యలు తీసుకుంటే తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతిదారులకు సరఫరా చేస్తే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అఖిల భారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణారావు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, అపెడా అధికారులు, రైతు నాయకులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు మరియు వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందు మహంతి ఎగుమతి విధానం అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు.

# నాలుగు నెలల తర్వాత సానుకూలంగా మారాయి

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
వస్తు ఎగుమతులు నాలుగు నెలల తర్వాత సానుకూలంగా మారాయి. మార్చి నెలలో 0.7 శాతం వృద్ధితో 41.97 బిలియన్ డాలర్లకు (రూ.3.6 లక్షల కోట్లు సుమారు) చేరాయి. వాణిజ్య లోటు 21.54 బిలియన్ డాలర్లకు విస్తరించినట్టు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద వస్తు ఎగుమతులు 0.08 శాతం పెరిగి 437.42 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
దిగుమతులు 6.67 శాతం పెరిగి 720.24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి 283 బిలియన్ డాలర్లకు పెరిగిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వాణిజ్య లోటు 14.05 బిలియన్ డాలర్లు కాగా.. గతేడాది మార్చిలో 15.33 బిలియన్ డాలర్ల చొప్పున ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య లోటు 241 బిలియన్ డాలర్లుగా ఉండడాన్ని గమనించొచ్చు. దిగుమతులు ఈ ఏడాది మార్చిలో నాలుగు నెలల గరిష్టానికి చేరి 63.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.



సేవల్లో వృద్ధి..
ఇక 2024-25 సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతులు అన్నీ కలసి 821 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023-24లో నమోదైన 778 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే 5.5 శాతం వృద్ధి నమోదైనట్టు తెలుస్తోంది. 2023-24లో సేవల ఎగుమతులు 341 బిలియన్ డాలర్లు కాగా, 2024-25లో 383.51 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు అంచనా.
2023-24తో పోల్చితే 2024-25లో ఇంజనీరింగ్ ఎగుమతులు 109.3 బిలియన్ డాలర్ల నుంచి 117 బిలియన్ డాలర్లకు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 29 బిలియన్ డాలర్ల నుంచి 38 బిలియన్ డాలర్లకు, ఫార్మా ఎగుమతులు 28 బిలియన్ డాలర్ల నుంచి 30.47 బిలియన్ డాలర్లకు పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తులు (63.34 బిలియన్ డాలర్లు) కెమికల్స్ రంగాల్లో (28.7 బిలియన్ డాలర్లు) ఎగుమతులు క్షీణించాయి.

# కృష్ణా జలాల్లో ఏపీ వాడకం 72.2%

**-తెలంగాణ వాడకం 27.8 శాతమే**
**-కృష్ణా బోర్డు గణాంకాలతో నీటిపారుదల శాఖ నివేదిక**

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**
ప్రస్తుత నీటి సంవత్సరం (2024-25)లో ఏపీ, తెలంగాణ మొత్తం 990.38 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, అందులో ఏకంగా 72.2 శాతం (715.03 టీఎంసీలు) ఏపీ వాడుకుంది. తెలంగాణ 275.35 టీఎంసీల (27.8 శాతం)ను మాత్రమే వినియోగించుకోగలిగింది. రెండు రాష్ట్రాల వాడకంపోగా, ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో కనీస నిల్వ మట్టానికి (ఎండీడీఎల్) ఎగువన 9.17 టీఎంసీలతోపాటు ఇతర జలాశయాల్లో మరో 43.94 టీఎంసీలు కలిపి మొత్తం 53.12 టీఎంసీలే మిగిలి ఉన్నాయి.
ఈ లెక్కన ప్రస్తుత నీటి సంవత్సరంలో మొత్తం 1043.5 టీఎంసీల జలాల లభ్యత ఉందని కృష్ణా బోర్డు తేల్చింది. గత సోమవారం నాటికి రెండు రాష్ట్రాలు వాడిన కృష్ణా జలాలకు సంబంధించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) రూపొందించిన గణాంకాలతో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈమేరకు ఓ నివేదిక తయారుచేసింది.



**50:50 నిష్పత్తిలో అయితే..**

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశం కృష్ణా ట్రిబ్యునల్-2లో పెండింగ్‌లో ఉంది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు తాత్కాలిక సర్దుబాటు ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో నీటి పంపకాలు జరుగుతుండగా, 50:50 నిష్పత్తిలో పంపకాలు జరపాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. అలా అయితే, 1043.5 టీఎంసీల్లో ఏపీ, తెలంగాణకు చెరో 521.75 టీఎంసీల హక్కులుంటాయి. దీంతో కృష్ణా జలాల్లో తెలంగాణకు ఇంకా 246.4 టీఎంసీల వాటా మిగిలి ఉంటుంది. ఏపీ వాటికి మించి 235.01 టీఎంసీలను వాడుకోవడంతో ఆ మేరకు నీటి వాటాను తెలంగాణ నష్టపోయింది.

**66:34 నిష్పత్తిలో తెలంగాణకి 68 టీఎంసీల నష్టం**

తాత్కాలిక సర్దుబాటు ప్రకారం 66:34 నిష్పత్తిలో పంపకాలు జరిపినా 1043.5 టీఎంసీల్లో ఏపీకి 688.714 టీఎంసీలు, తెలంగాణకి 354.79 టీఎంసీల వాటా లభించాలి. ఈ లెక్కన తెలంగాణ ఈ ఏడాది వాడుకున్న జలాలు పోగా ఇంకా 77.22 టీఎంసీలను వాడుకోవడానికి హక్కు కలిగి ఉండనుంది. ఏపీ వాటాకి మించి 68.05 టీఎంసీలను వాడుకోవడంతో తెలంగాణ ఆ మేరకు నీటి వాటాను కోల్పోయింది. ఉమ్మడి జలాశయాల్లో మిగిలి ఉన్న మొత్తం 9.17 టీఎంసీలను తెలంగాణకే కేటాయించినా హక్కుగా లభించాల్సిన వాటాల్లో మరో 68.05 టీఎంసీల లోటును రాష్ట్రం ఎదుర్కోనుంది.

**పోతిరెడ్డిపాడు నుంచి 208 టీఎంసీల మళ్లింపు**


శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 208.64 టీఎంసీలు, మల్యాల లిఫ్టు ద్వారా 28.36 టీఎంసీలు, మల్యాల నుంచి కేసీ కాల్వకి 1.19 టీఎంసీలు, ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా 3.49 టీఎంసీలు, చెన్నైకి నీటి సరఫరాకి 1.88 టీఎంసీలు కలిపి ఏపీ మొత్తం 243.58 టీఎంసీలను వాడుకుంది. ఇక నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 29.45 టీఎంసీలు, కుడి కాల్వ ద్వారా 188.16 టీఎంసీలు కలిపి మరో 217.62 టీఎంసీలను ఏపీ వాడుకుంది. ఇలా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు ఏపీ మొత్తం 715.03 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకున్నట్టు బోర్డు లెక్క గట్టింది.

**అరకొరగానే తెలంగాణ వాడకం**

శ్రీశైలం నుంచి కల్వకుర్తి లిఫ్టు ద్వారా 46.75 టీఎంసీలు, చెన్నైకి నీటి సరఫరాకి 0.94 టీఎంసీలు కలిపి మొత్తం 47.69 టీఎంసీలను మాత్రమే తెలంగాణ వాడుకుంది. సాగర్ నుంచి ఏఎమ్మార్పీ ప్రాజెక్టు అవసరాలకు 41.42 టీఎంసీలు, ఎడమ కాల్వ ద్వారా 115.48 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 14.37 టీఎంసీలు కలిపి మొత్తం 171.28 టీఎంసీలను రాష్ట్రం వాడుకుంది. జూరాల ప్రాజెక్టు నుంచి మరో 42.25 టీఎంసీలు, ఇతర ప్రాజెక్టుల నుంచి మరో 8.42 టీఎంసీలు కలిపి ఈ ఏడాది తెలంగాణ మొత్తం 275.35 టీఎంసీలను మాత్రమే వాడుకోగలిగింది.







# కోల్‌కతాకు షాక్

సొంత మైదానంలో బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై పంజాబ్ కింగ్స్ పడుతూ లేస్తూ 111 పరుగులు చేసింది. మరో 27 బంతులు మిగిలి ఉండగానే ఇన్నింగ్స్ ముగిసింది. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) విజయంపై ఎవరికీ ఎలాంటి సందేహాలు లేవు. 14.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తే కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో నంబర్‌వన్ స్థానానికి కూడా దూసుకుపోతుంది. ఎంత వేగంగా ఛేదిస్తారనే దానిపైనే చర్చ. 62/2 స్కోరుతో జట్టు గెలుపు దిశగా సాగింది. కానీ ఒక్కసారిగా అనూహ్యం జరిగింది. యుజువేంద్ర చహల్ పదునైన స్పిన్‌తో కేకేఆర్ పతనానికి శ్రీకారం చుట్టాడు. 17 పరుగుల వ్యవధిలో కోల్‌కతా 6 వికెట్లు కోల్పోయింది. అయితే రసెల్ ఒకే ఓవర్లో 16 పరుగులు రాబట్టడంతో మళ్లీ కేకేఆర్ విజయంపై అంచనాలు... కానీ యాన్సెన్ బంతితో రసెల్ ఆట ముగిసింది... మరో 29 బంతులు మిగిలి ఉండగానే కోల్‌కతా ఆలౌట్... పంజాబ్ అభిమానులతో మైదానం ఒక్కసారిగా హోరెత్తింది. శనివారం 245 పరుగులు చేసి కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడిన పంజాబ్ కింగ్స్...ఇప్పుడు ఐపీఎల్ చరిత్రలోనే అతి తక్కువ లక్ష్యాన్ని కాపాడుకున్న జట్టుగా నిలిచింది.

ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో అరుదుగా కనిపించే తక్కువ స్కోర్ల మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా ముగిసింది. మంగళవారం జరిగిన ఈ పోరులో పంజాబ్ కింగ్స్ 16 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ 15.1 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (15 బంతుల్లో 30; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం కోల్‌కతా 15.1 ఓవర్లలో 95 పరుగులకే ఆలౌటైంది. రఘువంశీ (28 బంతుల్లో 37; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యుజువేంద్ర చహల్ (4/28) ప్రత్యర్థిని కుప్పకూల్చాడు.

**ఓపెనింగ్ మినహా...**

తొలి 19 బంతుల్లో 39/0... తర్వాతి 17 బంతుల్లో 15/4... పవర్‌ప్లేలో పంజాబ్ ఆటతీరు ఇది. ఓపెనర్ల ఆటతీరు చూస్తే ఈ మైదానంలో జరిగిన గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే భారీ స్కోరు ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత జట్టు ఒక్కసారిగా కుప్పకూలింది. నోర్జే ఓవర్లో ప్రియాన్ష్‌ఆర్య (12 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) రెండు ఫోర్లు కొట్టగా... అరోరా వేసిన తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా 4, 6, 4 బాదాడు. అదే ఓవర్లో ప్రియాన్ష్ కూడా ఫోర్ కొట్టడంతో మొత్తం 20 పరుగులు వచ్చాయి.

రాణా తొలి బంతిని ప్రియాకూ సిక్స్ కొట్టే వరకు అంతా బాగుంది. కానీ ఆ తర్వాతి బంతి నుంచే కోల్‌కతా బౌలర్ల జోరు మొదలైంది. అదే ఓవర్లో ప్రియాన్ష్ , శ్రేయస్ అయ్యర్ (0)లను అవుట్ చేసిన రాణా తన తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్‌ను కూడా వెనక్కి పంపాడు. అంతకు ముందే సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఇన్‌గ్లిస్ (2) కూడా వరుణ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 6 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 54/4కు చేరింది.

ఇక ఆ తర్వాత పంజాబ్ కోలుకోలేకపోయింది. నైట్‌రైడర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు బ్యాటర్లంతా ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. పవర్‌ప్లే తర్వాత ఆడిన 57 బంతుల్లో 57 పరుగులు మాత్రమే చేసిన జట్టు 6 వికెట్లు కోల్పోయింది. వధేరా (10), మ్యాక్స్‌వెల్ (7), ఇంపాక్ట్ సబ్‌గా వచ్చిన సూర్యాంశ్ (4) ఏమాత్రం ప్రభావం చూపలేకపోగా, శశాంక్ సింగ్ (17 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) కూడా విఫలమయ్యాడు.

**టపటపా...**

ఛేదనలో కోల్‌కతాకు సరైన ఆరంభం లభించలేదు. మూడు బంతుల వ్యవధిలో ఒకే స్కోరు వద్ద ఓపెనర్లు నరైన్ (5), డికాక్ (2) వెనుదిరిగారు. అయితే అజింక్య రహానే (17), రఘువంశీ కలిసి కొన్ని చక్కటి షాట్లతో మూడో వికెట్‌కు 38 బంతుల్లో 55 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే రహానే వెనుదిరిగిన తర్వాత కేకేఆర్ పతనం వేగంగా సాగిపోయింది.

ఒక్కరు కూడా పట్టుదలగా నిలబడి జట్టును గెలిపించే ప్రయత్నం చేయలేకపోయారు. చివర్లో రసెల్ (11 బంతుల్లో 17; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కొంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. రహానే దురదృష్టవశాత్తూ ఎల్బీపై రివ్యూ కోరకపోవడం కూడా కేకేఆర్‌కు నష్టం కలిగించింది. అతని అవుట్ తర్వాతే పరిస్థితి మారింది. బాల్ ట్రాకింగ్‌లో ప్రభావం ఆఫ్ స్టంప్ బయట కనిపించింది. రివ్యూ కోరితే అతను నాటౌట్‌గా తేలేవాడు.

**చహల్ మ్యాజిక్**

టోర్నీ తొలి 5 మ్యాచ్‌లలో ఏకంగా 83.50 సగటు, 11.13 చెత్త ఎకానమీతో కేవలం 2 వికెట్లు... 2 మ్యాచ్‌లలో మాత్రమే ఓవర్ల కోటా పూర్తి... వేలంలో రూ.18 కోట్లతో అమ్ముడుపోయిన చహల్ పేలవ ఫామ్ ఇది. కచ్చితంగా రాణించాల్సిన తీవ్ర ఒత్తిడి మధ్య బరిలోకి దిగిన అతను మ్యాజిక్ చూపించాడు. వరుస ఓవర్లలో రహానే, రఘువంశీలను అవుట్ చేసి పంజాబ్ శిబిరంలో ఆశలు రేపిన అతను కీలక సమయంలో వరుస బంతుల్లో రింకూ, రమణ్‌దీప్‌లను వెనక్కి పంపి విజయానికి బాటలు వేశాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా తనకున్న గుర్తింపును నిలబెట్టుకుంటూ మళ్లీ రేసులోకి వచ్చాడు.

**స్కోరు వివరాలు**

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్(సి) రమణ్‌దీప్ (బి) రాణా 22; ప్రభ్‌సిమ్రన్ (సి) రమణ్‌దీప్ (బి) రాణా 30; శ్రేయస్ (సి) రమణ్‌దీప్ (బి) రాణా 0; ఇన్‌గ్లిస్ (బి) వరుణ్ 2; వధేరా (సి) వెంకటేశ్ (బి) నోర్జే 10; మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 7; సూర్యాంశ్ (సి) డికాక్ (బి) నరైన్ 4; శశాంక్ (ఎల్బీ) (బి) అరోరా 18; యాన్సెన్ (బి) నరైన్ 1; బార్ట్‌లెట్ (రనౌట్) 11; అర్ష్ దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (15.3 ఓవర్లలో ఆలౌట్) 111. వికెట్ల పతనం: 1-39, 2-39, 3-42, 4-54, 5-74, 6-76, 7-80, 8-86, 9-109, 10-111. బౌలింగ్: వైభవ్ అరోరా 2.3-0-26-1, నోర్జే 3-0-23-1, హర్షిత్ రాణా 3-0-25-3, వరుణ్ చక్రవర్తి 4-0-21-2, నరైన్ 3-0-14-2.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) సూర్యాంశ్ (బి) బార్ట్‌లెట్ 2; నరైన్ (బి) యాన్సెన్ 5; రహానే (ఎల్బీ) (బి) చహల్ 17; రఘువంశీ (సి) బార్ట్‌లెట్ (బి) చహల్ 37; వెంకటేశ్ (ఎల్బీ) (బి) మ్యాక్స్‌వెల్ 7; రింకూ సింగ్ (స్టంప్డ్) ఇన్‌గ్లిస్ (బి) చహల్ 2; రసెల్ (బి) యాన్సెన్ 17; రమణ్‌దీప్ (సి) శ్రేయస్ (బి) చహల్ 0; రాణా (బి) యాన్సెన్ 3; అరోరా (సి) ఇన్‌గ్లిస్ (బి) అర్ష్ దీప్ 0; నోర్జే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (15.1 ఓవర్లలో ఆలౌట్) 95. వికెట్ల పతనం: 1-7, 2-7, 3-62, 4-72, 5-74, 6-76, 7-76, 8-79, 9-95, 10-95. బౌలింగ్: యాన్సెన్ 3.1-0-17-3, బార్ట్‌లెట్ 3-0-30-1, అర్ష్ దీప్ 3-1-11-1, చహల్ 4-0-28-4, మ్యాక్స్‌వెల్ 2-0-5-1.





## ఆర్చరీ కమిటీ సభ్యుడిగా శంకరయ్య

జాతీయ ఆర్చరీ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా మహబూబాబాద్‌కు చెందిన పుట్టా శంకరయ్య నియమితులయ్యారు.ఈ కమిటీలో మొత్తం ఎనిమిది మందికి చోటు కల్పించారు. చైర్మన్‌గా విజయవాడకు చెందిన చెరుకూరి సత్యనారాయణ, కన్వీనర్‌గా సుమంత చంద్ర మొహంతి, జమ్యాంగ్ సెరింగ్, దేవానంద సింగ్, అలాగే సంజీవ్ సింగ్, పూర్ణిమ, జీవన్‌జ్యోత్ సింగ్ (ఈ ముగ్గురూ ద్రోణాచార్య అవార్డీలు)కు కమిటీలో చోటు లభించింది.



## దూసుకెళ్తున్న రష్మిక

భారత్‌లో మహిళల టెన్నిస్ అనగానే గుర్తొచ్చే పేరు.. సానియా మీర్జా. టెన్నిస్‌లో భారత అమ్మాయిలెవరూ కలలో కూడా ఊహించని ఘనతలు సానియా సొంతం. డబ్ల్యూటీఏ, గ్రాండ్‌స్లామ్‌లపై తనదైన ముద్ర వేసిన సానియా మీర్జా.. డబుల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ వరకు దూసుకెళ్లింది. ఆటకు ఆమె వీడ్కోలు పలికిన తర్వాత భారత మహిళల టెన్నిస్‌లో పూర్తిగా స్తబ్దత నెలకొంది. సానియా వారసుల సంగతి అటుంచితే కనీసం అత్యున్నత వేదికల్లో భారత్‌కు ప్రాతినిధ్యమే కరవైంది! భారత మహిళల టెన్నిస్ అస్థిత్వమే ప్రమాదంలో పడుతున్న సమయంలో బిల్లీజీన్ కింగ్ కప్ వెలుగులు నింపింది. హైదరాబాద్ గడ్డ మీద నుంచే దూసుకొచ్చిన మరో రాకెట్ భారత మహిళల టెన్నిస్‌కు దిక్సూచిగా మారింది. వరుసగా అయిదు విజయాలతో సత్తాచాటి భారత్‌ను ప్రపంచ ప్లేఆఫ్స్‌కు తీసుకెళ్లింది తెలుగమ్మాయి.. భమిడిపాటి శ్రీవల్లి రష్మిక.

బిల్లీజీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా టోర్నీకి భారత్‌ను వేదికగా ప్రకటించినప్పుడు ఆతిథ్య జట్టు అద్భుతాలు సాధిస్తుందన్న అంచనాలు ఎవరికీ లేవు. న్యూజిలాండ్, థాయ్‌లాండ్, హాంకాంగ్, చైనీస్ తైపీ, కొరియా జట్లకు పోటీ ఇవ్వగలదన్న నమ్మకమూ లేదు. ఇక తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో భారత్ పరాజయంతో ప్రపంచ ప్లేఆఫ్స్ ఆశలు సన్నగిల్లాయి! ఇక భారత్ ఆతిథ్య పాత్రకే పరిమితమవుతుందన్న అభిప్రాయమూ వ్యక్తమైంది. అయితే భారత జట్టు బాధ్యతల్ని, దేశ ప్రతిష్టను తన భుజాలపై వేసుకున్న రష్మిక అద్భుతమే చేసింది. సింగిల్స్‌లో రష్మిక అజేయ పోరాటం తోటి క్రీడాకారిణుల్లోనూ స్ఫూర్తి రగిలించింది. న్యూజిలాండ్‌తో పోరులోనూ సింగిల్స్‌లో నెగ్గిన రష్మిక.. ఆ తర్వాత జైత్రయాత్ర కొనసాగించింది. వరుసగా థాయ్‌లాండ్, హాంకాంగ్, చైనీస్ తైపీ, కొరియా జట్లతో మ్యాచ్‌ల్లో సింగిల్స్‌లో శ్రీవల్లికి ఎదురులేకుండా పోయింది. రష్మిక ప్రేరణతో మిగతా వాళ్లూ సత్తాచాటడంతో వరుసగా 4 మ్యాచ్‌ల్లో భారత్ 21 స్కోర్లతో ప్రత్యర్థి జట్లను మట్టికరిపించింది. పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ తర్వాత రెండో స్థానం సాధించిన భారత్ ప్రపంచ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ప్రపంచ గ్రూపు ప్లేఆఫ్స్ బెర్తు దక్కడంతో భారత టెన్నిస్ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే. 202021లో భారత్ తొలిసారిగా ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి జట్టులో స్ఫూర్తి నింపిన 22 ఏళ్ల శ్రీవల్లిదే ఈ ఘనత. శ్రీవల్లి 5 మ్యాచ్‌ల్లో 38 ఏస్‌లు సంధించడం విశేషం.

5 అడుగుల 11 అంగుళాల పొడగరి శ్రీవల్లి పేరు ఇప్పుడు జాతీయ స్థాయిలో మారుమోగుతోంది. డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో 345వ స్థానంలో ఉన్న తెలుగమ్మాయి.. రానున్న కాలంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఐటీఎఫ్ టోర్నీల్లో ఇప్పటికే తనను తాను నిరూపించుకున్న శ్రీవల్లి.. డబ్ల్యూటీఏ ఈవెంట్లపైనా దృష్టిసారించింది. ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో మెరుగైన క్రీడాకారిణులపై విజయాలతో సత్తాచాటుతోంది. గత కొన్ని నెలల్లో నావో హిబినో (76వ ర్యాంకు జపాన్)), ఐరినా మరియా (174 రొమేనియా), ఎలెనా ప్రిదినకినా (182 రష్యా), వాలెంటిని (218 గ్రీస్), జస్టినా మికుల్‌స్కైట్ (225 లిథువేనియా), తరౌదీ (232 థాయ్‌లాండ్), మిసాకి మత్సుద (254 జపాన్), చెవెల్‌రీ మర్స్ (266 స్పెయిన్)పై శ్రీవల్లి పైచేయి సాధించింది. ఐటీఎఫ్ సింగిల్స్, డబుల్స్‌లో మంచి అనుభవం సంపాదించిన శ్రీవల్లి భవిష్యత్తులో మరిన్ని ఘనతలు అందుకుంటుందనడంలో సందేహం లేదు.



## బంగ్లాదేశ్‌లో టీమిండియా పర్యటన ఖరారు.. షెడ్యూల్ విడుదల

ఈ ఏడాది ఆగస్ట్‌లో భారత్ క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ ఇవాళ (ఏప్రిల్ 15) ప్రకటించింది. ఈ పర్యటనలో టీమిండియా మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. రెండు వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆగస్ట్ 17న వన్డే సిరీస్.. 26న టీ20 సిరీస్ మొదలవుతాయి.

**వన్డే సిరీస్ షెడ్యూల్..**

తొలి వన్డే - ఆదివారం, ఆగస్టు 17, మిర్పూర్
రెండో వన్డే - బుధవారం, ఆగస్టు 20, మిర్పూర్
మూడో వన్డే - శనివారం, ఆగస్టు 23, చట్టోగ్రామ్

**టీ20 సిరీస్ షెడ్యూల్..**

తొలి T20I - మంగళవారం, ఆగస్టు 26, చట్టోగ్రామ్‌ల
రెండో T20I - శుక్రవారం, ఆగస్టు 29, మిర్పూర్‌ల
మూడు T20I - ఆదివారం, ఆగస్టు 31, మిర్పూర్



కాగా, భారత క్రికెటర్లంతా ప్రస్తుతం ఐపీఎల్ 2025తో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది క్యాష్ రిచ్ లీగ్ మే 25న ముగుస్తుంది. అనంతరం భారత్ జూన్‌లో ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భారత్ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది.

## చెన్నై జట్టులో 17 ఏళ్ల అయూష్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో రుతురాజ్ గైక్వాడ్ కీలక ఆటగాడు. పైగా కెప్టెన్! గాయంతో అతడు ఈసారి ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. అతడికి ప్రత్యామ్నాయంగా ఆ జట్టు సీనియర్ బ్యాటర్‌ని తీసుకుంటుందని అనుకున్నారు. కానీ అందరి అంచనాలకు భిన్నంగా 17 ఏళ్ల అయూష్ మాత్రే చెన్నై జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2024 సీజన్లో విజయ్‌హజారే ట్రోఫీలో ముంబయి తరపున అరంగేట్రం చేసిన ఈ ఓపెనర్ కర్ణాటకపై తొలి మ్యాచ్‌లోనే 78 పరుగులతో అదరగొట్టాడు. తర్వాత నాగాలాండ్‌పై 181.. సౌరాష్ట్రపై 148 పరుగులు చేసి అందరి దృష్టిలో పడ్డాడు. ఈ ఏడాది జనవరిలో మేఘాలయపై అయూష్ తొలి రంజీ మ్యాచ్ ఆడాడు. కానీ మెగా వేలంలో ఈ కుర్రాడిపై ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి చూపించలేదు. రుతురాజ్‌కు గాయం కావడంతో చెన్నై.. అయూష్‌కు అవకాశం ఇచ్చింది. రూ.30 లక్షల కనీస ధరకు దక్కించుకుంది. జంపా స్థానంలో రవిచంద్రన్: గాయపడిన లెగ్‌స్పిన్నర్ ఆడమ్ జంపా స్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రవిచంద్రన్ సమరన్‌ను జట్టులోకి తీసుకుంది. కర్ణాటకకు చెందిన 21 ఏళ్ల రవిచంద్రన్ ఎడమచేతి వాటం బ్యాటర్. అతడిని రూ.30 లక్షల కనీస ధరకు సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. ఇప్పటిదాకా 7 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రవిచంద్రన్.. 64.50 సగటుతో 516 పరుగులు చేశాడు. ఆరు టీ20 మ్యాచ్‌ల్లో 170 పరుగులు సాధించాడు.



# బాలీవుడ్ సినిమాతో రానున్న పృథ్వీరాజ్ సుకుమారన్.. హీరోయిన్ ఫిక్స్



నటుడిగా దర్శకుడిగా వరుస సినిమాలతో అలరిస్తున్నారు పృథ్వీరాజ్ సుకుమారన్ ఇటీవలే 'ఎల్ 2'తో దర్శకుడిగా హిట్‌ను సొంతం చేసుకున్న ఆయన.. ఇప్పుడు హీరోగా మరో ప్రాజెక్ట్‌తో పలకరించనున్నారు. తాజాగా దీని వివరాలను పంచుకున్నారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా మేఘనా గుల్జార్.. 'దైరా' అనే సినిమాను రూపొందించనన్నారు. ఇందులో ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ (Kareena Kapoor) నటించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మొదట ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా, సిద్ధార్థ్ మల్హోత్రా నటించనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా నటీనటుల వివరాలు వెల్లడించడంతో వీటికి చెక్ పడింది. ఇందులో పృథ్వీరాజ్ పోలీసుగా శక్తిమంతమైన పాత్రలో కనిపించున్నారు. హీరోయిన్ పాత్ర కూడా సినిమాలో కీలకం కానుందని సమాచారం.

నిరాశ తర్వాత హీరోగా మాధవన్.. నో చెప్పిన విక్రమ్: 25 ఏళ్ల 'సఖి' విశేషాలివీ

దీనిపై పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించిందని తెలిపారు. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర అని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌పై కరీనా కూడా ఆనందం వ్యక్తంచేశారు. "నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మేఘనా గుల్జార్ వర్క్‌కు నేను అభిమానిని. ఆమె దర్శకత్వంలో నటించాలనేది నా కల. దీని షూటింగ్ ఎప్పుడు ప్రారంభిస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని అన్నారు.



# తన మనసులోని మాట బయటపెడుతూ.. తమన్నా

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా 'ఓదెల-2' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అశోక్ తేజ దర్శకత్వంలో రాబోతున్న ఈ మూవీలో హెబ్బా పటేల్ వశిష్ట సింహ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అయితే ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ 'ఓదెల రైల్వే స్టేషన్' కు సీక్వెల్‌గా తెరకెక్కడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. ఏప్రిల్ 17న 'ఓదెల-2' థియేటర్స్‌లో రాబోతున్న విషయం తెలిసిందే. దీంతో మూవీ మేకర్స్ ప్రమోషన్స్ జోరు పెంచారు.

వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు ఆసక్తికర కామెంట్లు చేయడంతో పాగు 'ఓదెల-2' విశేషాలు పంచుకుంటున్నారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను మూవీ మేకర్స్ నిర్వహించారు. ఇక ఈ కార్యక్రమానికి టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ చీఫ్ గెస్ట్‌గా వచ్చారు. ఇందులో భాగంగా టీమ్ అందరికీ తన బెస్ట్ విషెస్ అందజేయడంతో పాటు తమన్నాను ప్రశంసలతో ముంచెత్తారు. ఆ తర్వాత మిల్కీ బ్యూటీ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నేను శర్వానంద్‌ను కలవలేదు.. అతనితో నటించలేదు. కానీ త్వరలోనే శర్వాతో ఓ సినిమా చేయాలని ఉంది. తప్పకుండా అతనిలో నటిస్తాను" అని చెప్పకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.



# సారంగపాణి జాతకం' ట్రైలర్

టాలీవుడ్ నటుడు ప్రియదర్శి ఎన్నో చిత్రాల్లో కమెడియన్‌గా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక 'మల్లేశం' మూవీతో హీరోగా మారిన ఆయన 'బలగం'తో ఊహించని రెస్పాన్స్‌కు దక్కించుకుని ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయారు. నిత్యం పలు విభిన్న కథలతో ప్రేక్షకులను అలరించేందుకు ప్రయత్నిస్తున్నారు. గత ఏడాది '35 చిన్న కథ కాదు' సినిమాతో వచ్చిన ప్రియదర్శి ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. కానీ ఆ తర్వాత నటించిన రెండు చిత్రాలు మెప్పించలేకపోయాయి. ఇక హిట్ ఫ్లాప్‌తో సంబంధం లేకుండా ప్రియదర్శి వరుస సినిమాల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఆయన 'సారంగపాణి జాతకం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఫ్యామిలీ, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి మోహనకృష్ణ ఇంద్రగంటిదర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ సినిమాను శ్రీదేవి మూవీస్ బ్యానర్‌పై కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో ప్రియదర్శి సరసన రూప కొడువాయూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఇప్పటికే 'సారంగపాణి జాతకం' మూవీ విడుదలైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ అన్ని మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. ఇక షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో మూవీ మేకర్స్ ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా, 'సారంగపాణి జాతకం' ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. ఏప్రిల్ 16న సాయంత్రం 6గంటలకు ట్రైలర్ విడుదల కాబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా థియేటర్లు మార్మోగిపోయేలా నవ్వించడానికి ఏప్రిల్ 25న మీ ముందుకు వస్తున్నాం.. మీరు కూడా వస్తున్నారా? అనే క్యాప్షన్ జత చేశారు.

# రామ్ చరణ్ అంటే పడిచచ్చిపోతున్న హీరోయిన్..

తెలుగు హీరోయిన్ కావ్య థాపర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. మోడలింగ్‌గా కెరీర్ ప్రారంభించిన ఈ బ్యూటీ తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మాయ పేరేమిటో చిత్రంతో తెలుగు సినీ ఇండస్ట్రీకీ ఎంట్రీ ఇచ్చి.. మొదటి సినిమాతోనే తన అద్భుతమైన నటనతో నెటిజన్లను ఆకట్టుకుంది. ఈ బ్యూటీ నటనకు మంచి మార్కులే పడ్డప్పటికీ మూవీ మాత్రం నార్మల్ టాక్ సొంతం చేసుకుంది.

తర్వాత తమిళంలో కూడా అవకాశాలు దక్కించుకుంది. అయినప్పటికీ కావ్య థాపర్‌కు అంతగా కలిసి రాలేదు. దీంతో మళ్లీ తెలుగు సినిమాల బాట పట్టింది ఏకంగా ఒకే సంవత్సరంలో టాలీవుడ్ సీనియర్ హీరో మాస్ మహారాజా రవితేజ సరసన ఈగల్, సందీప్ కిషన్ తో ఊరు పేరు భైరవకోన, ఎనర్జిటిక్ రామ్ పోతినేని సరసన డబుల్ ఇస్మార్ట్ సినిమాల్లో అవకాశం దక్కించుకుంది. వీటితో పాటు ఈ ముద్దుగుమ్మ గోపీచంద్ కీలక పాత్రలో నటించిన విశ్వం సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకుల మనసులో స్థానం దక్కించుకుంది. కానీ ఇందులో ఊరు పేరు భైరవకోన మూవీ ఒక్కటి మాత్రమే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుందని చెప్పకోవచ్చు. ప్రస్తుతం ఈ బ్యూటీ ఓ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదంతా పక్కన పెడితే.. కావ్య థాపర్ పలు ఇంటర్వ్యూల్లో చేసిన ఇంట్రెస్టింగ్ కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఫేవరెట్ హీరో ఎవరని ప్రశ్న ఎదురవ్వగా.. రామ్ చరణ్ అని చెప్పకొచ్చింది. అంతేకాకుండా.. తన ఫస్ట్ క్రష్ కూడా చరణ్ అని వెల్లడించింది. తను చాలా క్యూట్‌గా నవ్వుతారని పేర్కొంది. మొత్తానికి కావ్య మనసులో మాట బయటపెట్టిందని, చరణ్ అంటే ఎంత లవో అంటూ మెగా ఫ్యాన్స్ తెగ మురిసిపోతున్నారు. ప్రజెంట్ కావ్య థాపర్ క్యూట్ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# రాజమౌళి సినిమాల్ని దాటేసిన నాని..

నాని హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ హిట్ 3. నిన్న(ఏప్రిల్ 14) ట్రైలర్ రిలీజ్ చేయగా రె స్పాన్స్ బాగానే వచ్చింది. కానీ 24 గంటలు గడిచేసరికి మాత్రం రాజమౌళి మూవీస్ రికార్డ్స్ దాటిపోయింది. ఇది మాత్రం ఓ రకంగా షాకింగ్ అని చెప్పొచ్చు. హిట్ సిరీస్ లో తొలి రెండు సినిమాల్ని థ్రిల్లర్స్ గా మలిచారు. కానీ మూడో భాగాన్ని మాత్రం నరుక్కోవడం, రక్తం ఏరులై పారడం అనేలా తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమైంది. చిన్నపిల్లలు, సున్నిత మనస్కులు తమ సినిమాని చూడొద్దని నాని చెప్పడం కూడా సినిమాపై ఓ రకంగా బజ్ పెంచింది. అలా రిలీజైన 24 గంటల్లో హిట్ 3 ట్రైలర్ కి 23.1 మిలియన్ వ్యూస్ వచ్చాయి. తద్వారా బాహుబలి 2 (21.81 మిలియన్), ఆర్ఆర్ఆర్ (20.45 మిలియన్), కేజీఎఫ్ 2 (19.38 మిలియన్) రికార్డ్స్ దాటేసినట్లు తెలుస్తోంది. ఇదంతా కూడా తెలుగు వెర్షన్ వరకు మాత్రమే. మే 1న థియేటర్లలోకి రాబోతున్న హిట్ 3 సినిమాకు శైలేష్ కొలను దర్శకుడు. శ్రీనిధి శెట్టి హీరోయిన్. మిక్కీ జే మేయర్ సంగీతమందించాడు. మరి బ్లడ్ బాత్ అనేలా ఉన్న ఈ మూవీ ఫలితం ఏమవుతుందో చూడాలి?





# సినీ ఇండస్ట్రీలో విషాదం..

సినీ ఇండస్ట్రీలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ తమిళ నటుడు, దర్శకుడు అనారోగ్యంతో కన్నుమూశారు. కోలీవుడ్‌కు చెందిన ఎస్ఎస్ స్టాన్లీ( 57) అనారోగ్య సమస్యలతో ఇవాళ తుదిశ్వాస విడిచారు. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ మరణిచారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు కోలీవుడ్ సినీతారలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు ఏప్రిల్ 15న వలసరవక్కంలోని విద్యుత్ శ్మశానవాటికలో జరగనున్నాయి.

కాగా.. స్టాన్లీ 'ఏప్రిల్ మాధతిల్', 'పుదుకోట్టైయిలిరుండు శరవణ్', 'మెర్క్యురీ పొక్కల్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 2000ల దశకంలో పలు కోలీవుడ్ సినిమాల్లో నటించారు. ఆ తర్వాత 'ఏప్రిల్ మాధతిల్' (2002) తో దర్శకుడిగా పరిచయమయ్యారు. ధనుశ్ హీరోగా నటించిన 'పుదుకోట్టైయిలిరుందు శరవణన్' మూవీకి కూడా ఆయనే దర్శకత్వం వహించారు. దర్శకత్వం వహించడంతో పాటు 'నినైతలే ఇనిక్కుమ్', 'నన్బన్' వంటి చిత్రాలలో సహాయ పాత్రలతో నటనలోకి అడుగుపెట్టారు. అతను చివరిగా విజయ్ సేతుపతి నటించిన 'మహారాజా' చిత్రంలో కనిపించారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana.
Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896